# విశాల భారతి

తెలుగు దినపత్రిక

08-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 94


## మారుతున్న బాల్యం!



- ఆటలు మరిచి ఫోన్లకే అతుక్కుపోతున్నారు
- పిల్లలకు గ్యాడ్జెట్ల కంటే మీ ప్రేమే ముఖ్యం
- సోషల్ మీడియా వల్ల పిల్లల్లో ఆందోళన పెరుగుతోంది
- అపరిచితులతో స్నేహం ప్రమాదకరం
- సహనం తగ్గి మొండిగా మారుతున్నారు
- పిల్లలను ప్రకృతికి, ఆటలకు దగ్గర చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నేటి ఆధునిక కాలంలో టెక్నాలజీ అనేది మనిషి జీవితంలో విడదీయలేని భాగమైపోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి పనికీ స్మార్ట్ ఫోన్ మీద ఆధారపడటం అలవాటుగా మారింది. పెద్దలే కాకుండా పసిపిల్లలు కూడా ఈ డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఒకప్పుడు పిల్లల అల్లరితో కళకళలాడే వీధులు నేడు నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి. దీనికి కారణం పిల్లలందరూ ఇళ్లలోనే ఉండి మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోవడమే. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రేపటి తరం శారీరక, మానసిక వికాసం కుంటుపడే ప్రమాదం ఉందని పోలీసు ఉన్నతాధికారి వీసీ సజ్జనర్ చేసిన హెచ్చరికలు ప్రతి తల్లిదండ్రికీ ఒక కనువిప్పులా మారాలి. మిగతా 4లో..





దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ వేడి మునుపెన్నడూ లేనంతగా రాజుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై చేసిన తీవ్ర విమర్శలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య సరికొత్త వివాదానికి తెరలేపాయి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆయనకు ఒక సుదీర్ఘమైన బహిరంగ లేఖను రాశారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని పేర్కొంటూనే, వ్యక్తిగత దూషణలు, అసంబద్ధ ఆరోపణలు చేయడం పరిణతి చెందిన నాయకత్వ లక్షణం కాదని విజయన్ తన లేఖలో ఘాటుగా హితవు పలికారు. కేరళ ప్రజల వాస్తవ అనుభవం రేవంత్ చెబుతున్న దానికి విరుద్ధంగా ఉందని ఆయన గుర్తుచేశారు. అవినీతి, అభివృద్ధి అంశాలపై రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు విజయన్ గణాంకాలతో కూడిన సమాధానం ఇచ్చారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన తాజా నివేదికలను ఉటంకిస్తూ తెలంగాణ కంటే కేరళ ఏయే రంగాల్లో ముందంజలో ఉందో స్పష్టంగా వివరించారు. భారతదేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రంగా కేరళ అగ్రస్థానంలో నిలిచిందని, అదే సమయంలో తెలంగాణ దేశవ్యాప్తంగా అత్యంత అవినీతి రాష్ట్రాల జాబితాలో ఆరో స్థానంలో ఉందని విజయన్ ఎద్దేవా చేశారు.

# ఆటిట్యూట్ తగ్గించుకో రేవంత్

- అవినీతి తక్కువ కేరళలోనే, తెలంగాణ 6వ స్థానం
- సుస్థిర అభివృద్ధిలో కేరళే దేశంలో నంబర్ వన్
- కేరళ ప్రగతి వామపక్షాల వల్లనే సాధ్యమైంది
- అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన
- పేదరికం లేని తొలి రాష్ట్రంగా కేరళ రికార్డు
- విమర్శల్లో అసభ్య భాష వాడొద్దని రేవంత్‌కు హితవు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
జాతీయ సుస్థిర అభివృద్ధి సూచీలో కేరళ 79 పాయింట్లతో దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని, ఈ విషయంలో తెలంగాణ ఆరో స్థానానికే పరిమితమైందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కేరళ సాధించిన సామాజిక పురోగతి అంతా కాంగ్రెస్ పార్టీ గొప్పేనన్న రేవంత్ వ్యాఖ్యలను విజయన్ తీవ్రంగా తప్పుపట్టారు. కేరళ చరిత్రను తిరగవేస్తూ వామపక్ష ప్రభుత్వాలు చేసిన పోరాటాలను ఆయన కళ్లకు కట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే అట్టడుగు వర్గాలకు భూమిని అందించేందుకు కమ్యూనిస్ట్ ప్రభుత్వం 'అగ్రేరియన్ రిలేషన్స్ బిల్లు'ను తెచ్చిందని, కానీ అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను ప్రయోగించి ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. 1980వ దశకంలో చేపట్టిన అక్షరాస్యత ఉద్యమం మరియు 1996లో అమలు చేసిన అధికార వికేంద్రీకరణ వంటి విప్లవాత్మక మార్పులు కేవలం వామపక్షాల కృషితోనే సాధ్యమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. నవ కేరళ నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలను విజయన్ మిగతా 2లో..

## ప్రగతి బాటలో కర్రెగుట్టలు



- ములుగులో డీజీపీ శివధర్ రెడ్డి పర్యటన
- పర్యాటక కేంద్రంగా మారనున్న కర్రెగుట్టలు
- పోలీస్ ఔట్‌పోస్ట్ నిర్మాణానికి శ్రీకారం
- గుత్తికోయ కుటుంబాలకు డీజీపీ వాహనాల పంపిణీ
- అటవీ సంరక్షణలో మహిళలదే కీలక పాత్ర
- మొరమురులో స్పెషల్ నర్సరీ ప్రారంభం

03

## ఒక్క రాత్రిలో ఇరాన్ అంతం



- రాత్రిలో దేశాన్ని తుడిచిపెట్టేస్తామంటూ వార్నింగ్
- మంగళవారం రాత్రి 8 గంటలకే టార్గెట్
- ఇరాన్‌పై విరుచుకుపడనున్న అమెరికా
- ట్రంప్ సంచలన పోస్ట్‌తో వణికిపోతున్న ఇరాన్
- ఇరాన్ ముగింపు మొదలైందన్న ట్రంప్

03

## చేతులు మారిన అసైన్డ్ పట్టాలు

- అసైన్డ్ భూముల అన్యాక్రాంతం
- 2.5 లక్షల ఎకరాల విక్రయంపై నివేదిక
- భూముల స్వాధీన యోచన
- భూములను ప్రభుత్వమే తీసుకునే అవకాశం
- జిల్లాల వారీగా భూముల స్థితిగతుల గుర్తింపు
- 3.5 లక్షల ఎకరాల భూమి సాగుకు దూరం
- రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలో రిజిస్ట్రేషన్ల గందరగోళం

02





## ప్రభుత్వ స్కూళ్లను ఇలా మార్చొచ్చు కదా..!



- అదిరిపోతున్న కోమటిరెడ్డి ప్రతీక్ స్కూల్ క్రేజ్
- అడ్మిషన్ల కోసం తెల్లవారుజాము నుంచే భారీ క్యూలు
- స్మార్ట్ క్లాసులు, ఏఐ బోధనతో అత్యాధునిక సౌకర్యాలు
- అడ్మిషన్ల సందడి చూసి ఆశ్చర్యపోతున్న జనాలు
- రూ. 8 కోట్లతో ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ నిర్మించిన స్కూల్
- వేల కోట్లు వృధా చేయకుండా ఇలాంటి స్కూళ్లు నిర్మించాలి
- నాణ్యమైన విద్యకు ఈ స్కూల్ ఒక రోల్ మోడల్

ప్రభుత్వ విద్య అంటే కేవలం ఉచితం మాత్రమే కాదు, అత్యున్నత ప్రమాణాలకు నిలయం కావాలని నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ మెడల్ స్కూల్ నిరూపిస్తోంది. నేటి విద్యా వ్యవస్థలో కార్పొరేట్ విద్యా సంస్థల ధాటికి సామాన్యుడు ఆర్థికంగా చితికిపోతున్న తరుణంలో, ఈ పాఠశాల ఒక ఆశాకిరణంలా ఆవిర్భవించింది. ప్రభుత్వ విద్యా రంగం పట్ల ప్రజల్లో సడలుతున్న నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నిలబడగలమనే భరోసాను ఈ బడి కల్పిస్తోంది. ఒక్క బడి రూపురేఖలు మారిస్తే చాలు, ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ విద్య వైపు నడిపించడానికి ఎంతటి ఉత్సాహం చూపిస్తారో ఇక్కడి దృశ్యాలే సాక్ష్యం చెబుతున్నాయి.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో వెలసిన ఈ పాఠశాల నేడు సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు తెల్లవారుజాము నుంచే బారులు తీరిన వైనం చూస్తుంటే, ఏదో స్టార్ హీరో సినిమా మొదటి రోజు మొదటి ఆట టికెట్ల కోసం అభిమానులు పడే తాపత్రయం గుర్తుకు వస్తోంది. గంటల తరబడి వేచి చూసి తమ బిడ్డకు సీటు సంపాదించాలనే తపన ప్రైవేటు స్కూళ్లలో సర్వసాధారణం కానీ, ఒక ప్రభుత్వ బడి వద్ద ఇలాంటి దృశ్యాలు కనిపించడం నిజంగా అరుదైన, ఆహ్వానించదగ్గ పరిణామం. విద్యార్థుల తల్లిదండ్రుల ఈ రద్దీని చూసి విద్యావేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన దివంగత కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో ఈ పాఠశాలను సకల సౌకర్యాలతో నిర్మించారు. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా, నేటి తరం విద్యార్థులకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాల అంటే పాత భవనాలు, సరిపడా గదులు లేని పరిస్థితి అనే పాత అభిప్రాయాన్ని ఈ పాఠశాల పటాపంచలు చేస్తోంది. ప్రతి తరగతి గదిలోనూ ఆహ్లాదకరమైన వాతావరణం, వినూత్నమైన డిజైన్లతో కూడిన ఫర్నిచర్ చూస్తుంటే విద్యార్థులు పాఠశాలకు రావడానికి మక్కువ చూపిస్తున్నారు. మిగతా 2లో..



## రేవంత్ అంటేనే రాక్షస పాలన

- హరీష్ రావు, బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- వికారాబాద్ జిల్లా పరిగి భూసేకరణ వివాదం
- భూసేకరణ నోటిఫికేషన్ రద్దు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు
- శంషాబాద్ , అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత
- ప్రజాస్వామ్య హననం, నిర్బంధాల పర్వం

**విశాలభారతి, తెలంగాణ:** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న పోరు మరోసారి పతాకస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న భూసేకరణ విధానాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ గళమెత్తుతుండగా, క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వికారాబాద్ జిల్లా పరిగి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరిస్తున్న భూములపై రైతులు వ్యక్తం చేస్తున్న నిరసనలకు మద్దతు మిగతా 2లో..

## రేవంత్ సర్కార్‌ది పిరికిపంద చర్య

- హరీశ్ రావు అరెస్ట్‌పై సర్కార్‌ది పిరికిపంద చర్య
- పరిగి భూసేకరణపై రేవంత్ సర్కార్‌పై విమర్శలు
- పోలీసుల అణచివేతపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- హామీలు అమలు చేయరు కానీ భూములు లాక్కుంటారా
- దొంగల్లా భూములు పంచుకుంటున్నారు



03

# చేతులు మారిన 'అసైన్డ్' పట్టాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రవ్యాప్తంగా సాగుభూమి లేని నిరుపేదలకు జీవనోపాధి కల్పించే లక్ష్యంతో దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు ఇప్పుడు అన్యాక్రాంతమై అక్రమార్కుల పరమయ్యాయి. ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి పంపిణీ చేసిన ఈ భూముల్లో సింహభాగం చేతులు మారిపోయినట్లు రెవెన్యూ శాఖ తాజాగా నిర్వహించిన సమగ్ర అధ్యయనంలో వెల్లడైంది. పేదల ఆకలి తీర్చాల్సిన భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో రంగులు మారుతుండటంతో ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తోంది. జిల్లాల వారీగా సేకరించిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, సుమారు రెండున్నర లక్షల ఎకరాల భూమి నిబంధనలకు విరుద్ధంగా విక్రయించబడినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు లేదా పారిశ్రామికాభివృద్ధికి ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ఉన్నత స్థాయిలో కసరత్తు సాగుతోంది. అసైన్డ్ భూముల వినియోగంపై నెలకొన్న గందరగోళం వల్ల లక్షలాది ఎకరాలకు నేటికీ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ కాలేదు. గతంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు భావించిన యంత్రాంగం, ఇనాం భూములతో పాటు అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఫలితంగా వీటిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు తమకు పట్టాలు దక్కవేమోనన్న ఆందోళనలో ఉన్నారు. ఒరిజినల్ లబ్ధిదారులు ఎవరు, ప్రస్తుతం ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉంది, అవి ఎప్పుడు విక్రయించబడ్డాయి అనే అంశాలపై కలెక్టర్లు అందించిన నివేదికలు ప్రభుత్వానికి చేరాయి. ఈ భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం ఏ రకమైన నిర్ణయం తీసుకున్నా అది రాజకీయంగా, సామాజికంగా అత్యంత సున్నితమైన అంశం కాబట్టి, ఆచి తూచి అడుగు వేయాలని పాలక పక్షం భావిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అసైన్డ్ భూముల నిర్వహణ, బదలాయింపు ప్రక్రియ ఎలా ఉందో తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే అధ్యయనం పూర్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లోని విధానాలను ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఎలా మార్చుకోవచ్చో నివేదికలో పొందుపరిచారు. భవిష్యత్తులో కేటాయించే అసైన్డ్ భూముల విషయంలో కేవలం



వ్యవసాయ భూములను మాత్రమే నిరుపేదలకు ఇవ్వాలని, కమర్షియల్ విలువ ఉన్న భూములను ప్రభుత్వ పరిధిలోనే ఉంచుకోవాలని ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర ఉన్న పార్టీ కావడంతో, ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా లబ్ధిదారులకు అన్యాయం జరగకూడదనే పట్టుదలతో యంత్రాంగం ఉంది. తెలంగాణ ప్రాంతంలో భూ పంపిణీ రికార్డులను పరిశీలిస్తే 1954 నుండి సుమారు 13 లక్షల మందికి 22.52 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే 2017 తర్వాత నిర్వహించిన భూ ప్రక్షాళనలో అనేక లొసుగులు బయటపడటంతో సుమారు ఏడున్నర లక్షల ఎకరాలకు కొత్త పాసు పుస్తకాలు మంజూరు కాలేదు. వీటిలో చాలా భూములను సాగు చేయకపోవడం లేదా అక్రమంగా విక్రయించడం వల్ల వాటిని నిషేధిత జాబితాలో చేర్చారు. సాగుకు పనికిరాని భూములకు సైతం గతంలో కొంతమంది అధికారులు పట్టాలు ఇచ్చినట్లు గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రతి ఇంచ్ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మేధోమధనం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం అసైన్డ్ భూముల్లో సుమారు మూడున్నర లక్షల ఎకరాలకు పైగా భూమి వ్యవసాయానికి ఏమాత్రం అనుకూలంగా లేదని తేలింది. ముఖ్యంగా నల్లగొండ వంటి జిల్లాల్లో లక్షకు పైగా ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నప్పటికీ, అందులో అతి తక్కువ విస్తీర్ణంలోనే సాగు జరుగుతోంది. దీనికి భిన్నంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేటాయించిన భూమి దాదాపు మొత్తం సాగుకు యోగ్యంగా ఉండటం గమనార్హం. హైదరాబాద్ పరిసరాల్లో కేటాయించిన అసైన్డ్ భూముల్లో ఒక్క ఎకరంలో కూడా సాగు జరగడం లేదని అధికారులు తేల్చారు. ఇటువంటి సాగుకు పనికిరాని భూములను పరిశ్రమల స్థాపనకు లేదా మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగర శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డిలో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఇక్కడ భూముల విలువ కోట్లలో ఉండటంతో సామాన్య రైతుల నుంచి బడా వ్యాపారులు ఈ భూములను కొనుగోలు చేశారు. చాలా చోట్ల అసైన్డ్ భూములు మున్సిపాలిటీల పరిధిలోకి రావడంతో అక్కడ భారీ భవనాలు, వెంచర్లు వెలిశాయి. రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకపోయినా నోటరీల ద్వారా, అగ్రిమెంట్ల ద్వారా లావాదేవీలు సాగించడంతో ఇప్పుడు ఆ భూములపై హక్కులు ఎవరివనేది పెద్ద చిక్కుముడిగా మారింది. ఈ ప్రాంతాల్లోని భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టింది. రంగారెడ్డి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా భూములు అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా చేతులు మారినట్లు అధికారుల నివేదికలో స్పష్టమైంది. నిబంధనలను ఉల్లంఘించి పేదల నుంచి భూములను కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలుచోట్ల అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఫార్మ్ హౌస్‌లకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగంలో కొంత కలకలం రేగుతోంది. ఈ భూముల స్వాధీనం ప్రక్రియ ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తే 1958 కంటే ముందు కేటాయించిన అసైన్డ్ భూములకు మాత్రమే విక్రయ హక్కులు ఉంటాయని గతంలో కోర్టులు తీర్పులు ఇచ్చాయి. కానీ ఆ తర్వాత కేటాయించిన భూముల విషయంలో ఎలాంటి విక్రయాలకు ఆస్కారం లేదు. అయినప్పటికీ లక్షలాది ఎకరాలు నిబంధనలకు తిలోదకాలిచ్చి విక్రయించబడ్డాయి. ఈ అక్రమాలను సరిదిద్దేందుకు రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేయడమే ఏకైక మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. అక్రమంగా బదిలీ అయిన భూములను స్వాధీనం చేసుకుంటేనే అసలైన పేదలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం అసైన్డ్ భూముల పట్ల త్వరలో ఒక సమగ్రమైన పాలసీని తీసుకురావాలని నిర్ణయించింది. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం ఉండాలని ముఖ్యమంత్రి స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాగులో ఉన్న పేద రైతులకు పట్టాలు ఇచ్చి భరోసా కల్పించడంతో పాటు, బడాబాబుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను వెలికితీసి ప్రజా అవసరాలకు వినియోగించాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రభుత్వ భూముల పరిరక్షణ జరగడమే కాకుండా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

ప్రస్తుతం రెవెన్యూ శాఖ తయారుచేసిన నివేదికపై కేబినెట్‌లో చర్చ జరగాల్సి ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తారా లేదా అన్నది వేచి చూడాలి. అదే సమయంలో అన్యాక్రాంతం అయిన భూముల స్వాధీనం కోసం ఒక ప్రత్యేక విభాగం లేదా టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ భూముల ప్రక్షాళన జరిగితే రాష్ట్రంలోని భూ నిర్వహణ వ్యవస్థలో ఒక భారీ మార్పు వస్తుందని భావిస్తున్నారు.

## ఆటిట్యూట్ తగ్గించుకో రేవంత్



**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ముఖ్యంగా వైద్య రంగంలో 'ఆర్ద్రం మిషన్' ద్వారా గ్రామీణ స్థాయిలో ఉన్న 670 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అత్యాధునిక ఫ్యామిలీ హెల్త్ సెంటర్లుగా మార్చిన తీరును ఆయన వివరించారు. దీనివల్ల సామాన్యులకు సైతం అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. విద్యారంగంలోనూ కేరళ విప్లవాత్మక మార్పులు సాధించిందని, దాదాపు 13,000 ప్రభుత్వ పాఠశాలలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేశామని, 45,000 తరగతి గదులను హైటెక్ వసతులతో తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. పేదరిక నిర్మూలనలో కేరళ సాధించిన విజయం యావత్ దేశానికి గర్వకారణమని విజయన్ పేర్కొన్నారు. 2025 నవంబర్ నాటికి తీవ్ర నిరుపేదలు లేని భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రంగా కేరళ రికార్డు సృష్టించడం చిన్న విషయం కాదని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత నిరుపేదలుగా గుర్తించిన 64,006 కుటుంబాలను ప్రత్యేక పథకాల ద్వారా ఆదుకుని, వారిని దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకువచ్చామని వివరించారు. కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇటువంటి సంక్షేమ నమూనాను అధ్యయనం చేయకుండా విమర్శలు చేయడం సమంజసం కాదని ఆయన తెలంగాణ ముఖ్యమంత్రికి తన లేఖ ద్వారా సూచించారు. ఐటీ రంగంలోనూ కేరళ గమ్యం దిశగా దూసుకుపోతోందని విజయన్ ధీమా వ్యక్తం చేశారు. 2026 నాటికి దేశీయ ఐటీ ఎగుమతుల్లో 10 శాతం వాటాను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఇప్పటికే 20,000 డీప్‌టెక్ స్టార్టప్‌లతో కూడిన డిజిటల్ సైన్స్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని, యువతకు ఉపాధి కల్పించడంలో కేరళ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేసే విషయంలో కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా గమనిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురైన జాప్యానికి గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలదే బాధ్యతని విజయన్ ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ, గెయిల్ పైప్‌లైన్, ఎడమన్‌కొచ్చి పవర్ హైవే వంటి కీలక ప్రాజెక్టులను గత పాలకులు విస్మరించారని, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వాటిని పునరుద్ధరించి పూర్తి చేశామని తెలిపారు. కొచ్చి మెట్రో, విజింజమ్ అంతర్జాతీయ ఓడరేవు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో సహకారం అందించలేదని, రాజకీయ కారణాలతో అభివృద్ధిని అడ్డుకోవడం వారి నైజమని ఆయన ఘాటుగా విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఎల్‌డిఎఫ్ కుమ్మక్కయిందన్న రేవంత్ రెడ్డి ఆరోపణలను విజయన్ పటాపంచలు చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వంపై అసలైన పోరాటం చేస్తోంది కేరళేనని ఆయన నొక్కి చెప్పారు. ఆర్టికల్ 131, 32 కింద సుప్రీంకోర్టును ఆశ్రయించి కేంద్రంపై న్యాయపోరాటం చేస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ అని గుర్తుచేశారు. బీజేపీయేతర రాష్ట్రాలను ఏకం చేయడంలో తాము ఎల్లప్పుడూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. ఒక అంశంపై స్పష్టమైన వైఖరిని ప్రదర్శించడానికి హద్దులు మీరిన భాషను వాడాల్సిన అవసరం లేదని, హుందాగా కూడా పోరాడొచ్చని ఆయన రేవంత్ రెడ్డికి హితవు పలికారు.

## ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి తెలంగాణ రైతు సంఘం డిమాండ్

- రైతులకు సరైన ధరలు లభించక ప్రైవేట్ వ్యాపారుల చేతిలో నష్టం
- ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అవసరం
- MSP అమలు, తక్షణ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు విధానం కోరింపు

**సత్తుపల్లి, విశాలభారతి :** తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పంట కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు తగిన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామంలో లేదా సమీప ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రైతులకు కనీస మద్దతు ధర (MSP)ను ఖచ్చితంగా అమలు చేయాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, చెల్లింపులు ఆలస్యం కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలంగాణ రైతు సంఘం హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మోరంపూడి వెంకట్రావు, పాకలపాటి ఝాన్సీ, వెంకటేశ్వరావు, రమేష్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ అంటేనే రాక్షస పాలన

**మొదటిపేజీ తరువాయి**

తెలిపేందుకు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావును పోలీసులు మార్గమధ్యంలోనే నిలువరించారు. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపింది. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన నిలబడాల్సిన బాధ్యతను విస్మరించి, నిర్బంధాలతో గొంతు నొక్కడం సరికాదని విపక్ష నేతలు మండిపడుతున్నారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి పరిగికి బయలుదేరిన హరీష్ రావును తొలుత గృహనిర్బంధం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే పోలీసుల కళ్లుగప్పి ఆయన ముందుకు సాగడంతో అప్పా జంక్షన్ వద్ద భారీగా మోహరించిన బలగాలు ఆయన వాహనాన్ని అడ్డుకున్నాయి. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నేతలను రహస్యంగా తరలించడంపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో శంషాబాద్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసుల చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రహదారిపై బైఠాయించి నినాదాలు చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం శంషాబాద్ పోలీసు స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడిన హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రస్తుత పాలనను రాక్షస పాలనగా అభివర్ణించిన ఆయన, ఇది కేవలం గడీల పాలనగా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో నమ్మబలికిన ఆరు గ్యారెంటీలను విస్మరించి, నేడు రైతుల భూములను లాక్కునేందుకు నోటిఫికేషన్లు ఇవ్వడం అత్యంత దౌర్జన్యమని ధ్వజమెత్తారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతుల గొంతు వినేందుకు కూడా ఓపిక లేని ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు పోలీసు రాజ్యాన్ని తలపిస్తున్నాయని, ప్రజా ప్రతినిధులను సైతం రైతులను కలవకుండా అడ్డుకోవడం దారుణమని నేతలు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం తన ఏడవ గ్యారెంటీ అని ప్రకటించిన ప్రభుత్వం, నేడు ప్రతిపక్షాల మీద భౌతిక దాడులు, అక్రమ అరెస్టులతో ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. శాసనసభలో ప్రజా సమస్యల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్తే అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదని వారు ఎత్తిచూపారు. పరిగి ప్రాంతంలో రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములను పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని హరీష్ రావు ప్రశ్నించారు. రైతులు తమ భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేకపోయినా, బలవంతంగా లాక్కోవాలని చూడటం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని అన్నారు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన భూములపైనే ప్రభుత్వ కన్ను పడటం బాధాకరమని, వారి జీవనోపాధిని దెబ్బతీయడం ద్వారా ప్రభుత్వం వికృతానందం పొందుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బోగస్ మాటలుగా మిగిలిపోయాయని, ప్రజలు ఇప్పటికే ఈ పాలనపై విసిగిపోయారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పురాణ పాత్రలతో పోలుస్తూ హరీష్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇతరులను రాక్షసులని సంబోధిస్తున్న ముఖ్యమంత్రి, వాస్తవానికి తానే అధునాతన రావణాసురుడిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చడం, రైతుల పొట్ట కొట్టడం ఏ రకమైన పాలన అని నిలదీశారు. రాష్ట్రంలోని విద్యార్థులు, మహిళలు, చివరకు విధులు నిర్వహిస్తున్న పోలీసులు కూడా ఈ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంలో ప్రస్తుత సర్కారు విజయవంతమైందని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల ఫలితాలపై ధీమా వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితి వస్తుందని హరీష్ రావు జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఆ పార్టీకి సింగిల్ డిజిట్ ఫలితాలు రావడం ఖాయమని అన్నారు. వచ్చేది రామరాజ్యమని, తిరిగి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాము చేసిన అభివృద్ధి పనుల వల్లనే రాష్ట్రం నిలబడి ఉందని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం అప్పులు చేయడం, అరెస్టులు చేయడంలోనే నిమగ్నమైందని విమర్శించారు. పోలీసు వాహనంలో నేతలను తరలిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాన్ని వెంబడించారు. నేతలను ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శంషాబాద్ నుంచి షాద్ నగర్ వైపు వాహనాన్ని మళ్లించిన పోలీసులు, మార్గమధ్యంలో ఎక్కడా ఆగకుండా ముందుకు సాగారు. కార్యకర్తల తాకిడి పెరగడంతో పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరగడంతో కొందరు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రజాస్వామిక నిరసనలను కూడా అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని నేతలు మండిపడ్డారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ అంశం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది.



# ప్రభుత్వ స్కూళ్లను ఇలా మార్చొచ్చు కదా..!

**మొదటిపేజీ తరువాయి**

ఈ పాఠశాల ప్రత్యేకత ఏమిటంటే ప్రభుత్వ రంగంలో మరెక్కడా లేని విధంగా స్మార్ట్ క్లాసులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనను ఇక్కడ ప్రవేశపెట్టారు. డిజిటల్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తున్నారు. కేవలం పుస్తక పాఠాలే కాకుండా, సాంకేతికతతో కూడిన ప్రయోగాత్మక విద్యను అందించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లో వేలకు వేలు ఫీజులు చెల్లించినా దక్కని ఇటువంటి సదుపాయాలు ఇక్కడ ఉచితంగా అందుతుండటం విశేషం. అందుకే మధ్యతరగతి ప్రజలు ఈ పాఠశాలలో చేర్పించేందుకు విపరీతంగా ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కూల్స్ పేరిట ఒక్కో పాఠశాలకు వందల కోట్లు ఖర్చు చేసే బదులు, ఉన్న పాఠశాలలనే ప్రతీక్ స్కూల్ నమూనాలో ఎందుకు అభివృద్ధి చేయకూడదని ప్రశ్నిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో కొత్త భవనాలు నిర్మించే కంటే, పరిమితమైన నిధులతో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే సత్ఫలితాలు వస్తాయని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఎనిమిది కోట్లతోనే ఒక ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ సంస్థలకు దీటుగా మార్చవచ్చని ఈ పాఠశాల నిరూపించింది. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సైతం గతంలో ఇటువంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. ఒక్కో పాఠశాలకు రెండు వందల కోట్లు వెచ్చించడం కంటే, తక్కువ ఖర్చుతో అత్యున్నత వసతులు కల్పించడం ద్వారా ఎక్కువ పాఠశాలలను బాగు చేయవచ్చని ఆయన సూచించారు. ఒక మోడల్ స్కూల్‌ను అభివృద్ధి చేస్తే దాని ప్రభావం చుట్టుపక్కల ప్రాంతాలపై ఎలా ఉంటుందో నల్లగొండలోని ఈ పాఠశాలే నిదర్శనం. ప్రజలకు నాణ్యమైన విద్య దొరుకుతుందనే నమ్మకం కలిగితే, వారు ప్రైవేటు సంస్థల దోపిడీ నుంచి విముక్తి పొందుతారని ఆయన పలు సందర్భాల్లో నొక్కి చెప్పారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో డొనేషన్ల పేరిట, ఫీజుల పేరిట సామాన్యుడి రక్తం పిండుతున్న పరిస్థితులు ఉన్నాయి. అప్పులు చేసి మరీ పిల్లలను చదివించాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ప్రతీక్ ప్రభుత్వ పాఠశాల వంటి వేదికలు సామాన్యులకు భరోసా ఇస్తున్నాయి. ప్రభుత్వ విద్యపై నమ్మకం కలగాలంటే కేవలం ప్రకటనలు ఇస్తే సరిపోదు, ఆచరణలో వసతులు చూపించాలని ఈ పాఠశాల నిరూపిస్తోంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ప్రతి జిల్లాలోనూ ఇటువంటి అద్భుతమైన పాఠశాలలను నిర్మించడం అసాధ్యమైన పనేమీ కాదు. నల్లగొండలోని ఈ మార్పు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకూడదని విద్యాభిమానులు కోరుకుంటున్నారు. విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం, ఆధునికమైన లైబ్రరీ, శాస్త్ర విజ్ఞానాన్ని అందించే ల్యాబ్స్ ఉంటే ఏ



ప్రభుత్వ పాఠశాలైనా ఇలాగే కళకళలాడుతుంది. తల్లిదండ్రులు ఆశించేది నాణ్యమైన విద్యా బోధన, సురక్షితమైన వాతావరణం మాత్రమే. ఈ రెండు లక్షణాలను పుణికిపుచ్చుకున్న ఈ పాఠశాల నేడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. భవిష్యత్తులో మిగిలిన ప్రభుత్వ పాఠశాలలకు ఇది ఒక మేలుబంతిగా నిలవనుంది. నిధుల కొరత అనేది సాకుగా చూపకుండా, అందుబాటులో ఉన్న నిధులతోనే అద్భుతాలు సృష్టించవచ్చని ఈ పాఠశాల ప్రాజెక్ట్ నిరూపిస్తోంది. కార్పొరేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు తరలిరావడం అనేది విద్యా రంగంలో ఒక విప్లవాత్మక మార్పు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే కావాలని, ప్రతి మండలంలోనూ ఇటువంటి విద్యా సౌకర్యాలు మెరుగుపడాలని జనం కోరుకుంటున్నారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను గుర్తించి, సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంకేతికతను విద్యతో జోడించినప్పుడు ఫలితాలు ఎంత వేగంగా ఉంటాయో ఈ పాఠశాల ప్రయోగం స్పష్టం చేస్తోంది. ఏఐ ఆధారిత విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం అనేది సాహసోపేతమైన మరియు ముందుచూపుతో కూడిన చర్య. దీనివల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పోటీ పడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం లభిస్తుంది. ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే విద్యా రంగంలో పెను మార్పులు వస్తాయని ఆశించవచ్చు. నల్లగొండ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాల అందించిన స్ఫూర్తితో ప్రభుత్వం మరిన్ని పాఠశాలలపై దృష్టి పెట్టాలి. అడ్మిషన్ల కోసం క్యూ కట్టిన తల్లిదండ్రుల నిరీక్షణ ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తోంది. ప్రజలు ప్రభుత్వ వ్యవస్థను నమ్మడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి కావలసింది కేవలం సరైన సౌకర్యాలు మాత్రమేనని అర్థమవుతోంది. విద్యా వ్యవస్థలో వస్తున్న ఈ సానుకూల మార్పు నిరంతరం కొనసాగాలని, అప్పుడే మన భావి తరాలు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని నిశ్చయంగా చెప్పవచ్చు.



# ప్రగతి బాటలో కర్రెగుట్టలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ములుగు జిల్లాలోని అత్యంత మారుమూల ప్రాంతమైన కర్రెగుట్టలు ఇప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం నుంచి పూర్తిగా విముక్తి పొంది ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. ఒకప్పుడు దట్టమైన అటవీ ప్రాంతంలో తుపాకుల మోతతో దద్దరిల్లిన ఈ కొండ ప్రాంతం, ప్రస్తుతం అభివృద్ధి పనుల శబ్దంతో కొత్త వెలుగును సంతరించుకుంది. మంగళవారం ములుగు జిల్లాలో విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీ శివధర్ రెడ్డి, కర్రెగుట్టలను అధికారికంగా మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటించారు. శాంతి భద్రతలు అదుపులోకి రావడంతో ఇకపై ఈ ప్రాంతం సామాజిక, ఆర్థిక విప్లవానికి వేదిక కాబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలోకి చేరుతున్న తీరును స్వయంగా పరిశీలించిన ఆయన, గిరిజన బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించారు. పామునూరు గ్రామం కేంద్రంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు డీజీపీ శంకుస్థాపన చేస్తూ అటవీ ప్రాంతాల్లో పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పోలీస్ యంత్రాంగం కేవలం రక్షణకే కాకుండా, గుత్తికోయ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి నిరంతరం శ్రమిస్తుందని హామీ ఇచ్చారు. గిరిజన గూడాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా వారిలో వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని వివరించారు.శాంతియుత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అటవీ సంపద, ప్రకృతి ఒడిలో ఉన్న ఈ కొండల అందాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పర్యాటకులు నిర్భయంగా ఇక్కడికి వచ్చి ప్రకృతిని ఆస్వాదించేలా పూర్తిస్థాయి రక్షణ కల్పించేందుకు పోలీస్ ఔట్‌పోస్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ఔట్‌పోస్ట్ కేవలం భద్రతకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సమయాల్లో సాయం అందించే కేంద్రంగా పనిచేయనుంది. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని డీజీపీ ఆకాంక్షించారు. గిరిజన కుటుంబాల స్వయం ఉపాధికి పెద్దపీట వేస్తూ పామునూరుకు చెందిన ఏడు కుటుంబాలకు డీజీపీ ప్రత్యేక సాయం అందజేశారు. ఉమ్మడి ఉపాధి కోసం ఒక ఆటోను, ఒక ద్విచక్ర వాహనాన్ని పంపిణీ చేయడంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అడవిపైనే ఆధారపడి జీవించే గిరిజనులు ఇప్పుడు ఆధునిక ఉపాధి మార్గాల వైపు మళ్లడం ఒక శుభపరిణామమని ఆయన కొనియాడారు. కేవలం శాంతి భద్రతల నిర్వహణే కాకుండా, సామాజిక బాధ్యతగా పోలీసు శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించే ఇలాంటి చర్యలు పోలీసుప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పాలనలో పారదర్శకత, వేగవంతమైన అభివృద్ధిని కాంక్షిస్తూ ఒక ప్రత్యేక సమన్వయ కేంద్రాన్ని డీజీపీ ప్రారంభించారు. అటవీ, రెవెన్యూ, సీఆర్పీఎఫ్, పోలీస్ శాఖల మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా ఈ కేంద్రాన్ని రూపొందించారు. వివిధ శాఖల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా ఉంటేనే అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేంద్రం ద్వారా క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం శక్తివంతంగా పనిచేయడానికి ఇదొక సరైన వేదికగా నిలవనుంది. వివిధ విభాగాల అధికారులు ఒకే గొడుగు కింద పనిచేయడం వల్ల పాలన మరింత చేరువవుతుంది. వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో డీజీపీ పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. "అరైవ్ అలైవ్" అనే నినాదంతో సుమారు 3000 మందితో నిర్వహించిన ఈ సభలో ప్రాణ భద్రత గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ 200 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. వాహనం నడిపే సమయంలో అజాగ్రత్త వహించడం వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ఆ నివారణ బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని గుర్తుచేశారు. నిబంధనల పాటింపు అనేది కేవలం జరిమానాల కోసం కాకుండా, ప్రాణాల కోసం అని స్పష్టం చేశారు. ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీజీపీ ప్రారంభించారు. వాహనదారులు, స్థానిక ప్రజల కంటి చూపును పరీక్షించి అవసరమైన వారికి మందులు, సలహాలు అందజేశారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనాలు నడిపేవారు దృష్టి లోపాల వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ఈ శిబిరం వారికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. పోలీసు శాఖ కేవలం నేరాల నియంత్రణకే కాకుండా, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కూడా భాగస్వామి కావడం విశేషం. శిబిరానికి విచ్చేసిన లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి మాట్లాడి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. పామునూరులోని సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌ను సందర్శించిన డీజీపీ, అక్కడ విధుల్లో ఉన్న జవాన్లను అభినందించారు. గిరిజన ప్రాంతాల్లోని కొండ కోనల్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల ధైర్యసాహసాలను ఆయన కొనియాడారు. వారితో కలిసి భోజనం చేస్తూ వారి యోగక్షేమాలను, కుటుంబ పరిస్థితులను ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు.



# రేవంత్ సర్కార్‌ది పిరికిపంద చర్య

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. భూములు కోల్పోతున్న బాధిత రైతులను కలిసి వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావుతో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్ తదితర నేతలను పోలీసులు మార్గమధ్యలోనే అడ్డుకుని అరెస్టు చేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. పార్టీ ముఖ్య నేతల నిర్బంధంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల పక్షాన నిలబడేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ పోలీసు బలగాలతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో పరిశ్రమల స్థాపన పేరుతో సుమారు 1,200 ఎకరాల సాగు భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటోందని కేటీఆర్ ఆరోపించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను వదులుకోవడానికి రైతులు సిద్ధంగా లేకపోయినా, అధికారులు దౌర్జన్యంగా భూసేకరణకు పూనుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించి కేవలం పేద ప్రజల భూములపై పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 వాగ్దానాలను అమలు చేయడంలో వైఫల్యం చెందిన ప్రభుత్వం, ఇప్పుడు రైతులను అరిగోస పెడుతూ భూములను లాక్కోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి కీలక పథకాలను అటకెక్కించిన ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ గుర్తు చేశారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు కొత్తగా పారిశ్రామికీకరణ పేరుతో పచ్చని పొలాలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చాలని చూడటం వెనుక కాంగ్రెస్ నేతల స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క భారీ పరిశ్రమను కూడా తీసుకురాలేని ఈ ప్రభుత్వం, కేవలం భూసేకరణ పైన మాత్రమే విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని విమర్శించారు. అభివృద్ధి పేరిట పేదల పొట్ట కొట్టడం కాంగ్రెస్ పార్టీ నైజమని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార మదంతో ఊళ్లు పంచుకుంటున్నట్లుగా భూములను కబ్జా చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల ఆవేదనను వినేందుకు ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా అణచివేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదని, తెలంగాణ ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ చవిచూశామని ఆయన గుర్తు చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన నిలబడటంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు, పోలీసు బెదిరింపులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడబోవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతుల హక్కుల కోసం చేసే పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం ఎంతగా అణచివేతకు పాల్పడినా భూ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా నిర్బంధించిన హరీశ్ రావు సహా ఇతర నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతుల అనుమతి లేకుండా ఒక్క ఎకరం భూమిని కూడా సేకరించనివ్వబోమని ఆయన హెచ్చరించారు. ప్రజాబలం ముందు పోలీసు బలగం ఎంతో కాలం నిలవదని ఆయన పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ తన గళాన్ని మరింత పెంచుతుందని కేటీఆర్ తెలిపారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఎండగడతామని చెప్పారు. పరిగి ఇండస్ట్రియల్ పార్కు భూ బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ఇది ప్రభుత్వం తన గొయ్యి తాను తవ్వుకోవడమేనని ఆయన విశ్లేషించారు. రైతును ఏడిపించిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ భూ దాహాన్ని ఆపుకోవాలని హితవు పలికారు. పరిశ్రమల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కానీ రైతుల సాగు భూములను బలవంతంగా లాక్కోవడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. బంజరు భూములు లేదా ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా పచ్చని పంట పొలాల వైపు ఎందుకు కన్నేశారని ఆయన ప్రశ్నించారు. ఈ వెనుక పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ మాఫియా ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. రైతుల కళ్ళల్లో నీళ్లు చూస్తూ అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. తమ భూములే తమకు ప్రాణాధారమని భావించే రైతుల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే పరిస్థితులు లేకపోవడం విచారకరమని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్ష నేతలు జిల్లాలకు వెళ్తుంటే గృహ నిర్బంధాలు చేయడం, దారి మళ్లించడం వంటి చర్యలు ప్రభుత్వ అసహనాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి భయపడే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకోకపోతే ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. భూ బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. పరిగి సంఘటనపై జాతీయ స్థాయి మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ తెలిపారు. రైతులపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రపంచానికి చాటి చెబుతామని చెప్పారు. హరీశ్ రావు వంటి సీనియర్ నేతలను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను దాచుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వ ఒత్తిడికి లొంగి చట్టవిరుద్ధంగా వ్యవహరించవద్దని ఆయన సూచించారు. రేపు ప్రభుత్వం మారితే జవాబుదారీతనం ఉంటుందని ఆయన గుర్తు చేశారు. బలవంతపు భూసేకరణ ఆపే వరకు బాధితులకు తోడుగా ఉంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా ఉండి రైతుల భూములను కాపాడాలని పిలుపునిచ్చారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే ముఖ్యమంత్రి, చట్టాన్ని తన ఇష్టానుసారం వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల భూములపై హక్కు ఉన్నట్లే, వాటిని కాపాడుకునే హక్కు కూడా రైతులకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# ఒక్క రాత్రిలో ఇరాన్ అంతం

**విశాలభారతి, అంతర్జాతీయం:** పశ్చిమాసియా రాజకీయ యవనికపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇరాన్ పాలకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. అగ్రరాజ్యం తలచుకుంటే కేవలం ఒకే ఒక్క రాత్రిలో ఆ దేశ ఉనికిని పూర్తిగా తుడిచిపెట్టగలమని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా నేరుగా సైనిక చర్యకు సంకేతాలుగా కనిపిస్తుండటంతో అంతర్జాతీయ సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అగ్రరాజ్యం నుంచి వెలువడిన ఈ ధాటిని గమనిస్తుంటే పశ్చిమాసియాలో ఏ క్షణంలోనైనా పెను విపత్తు సంభవించేలా కనిపిస్తోంది. ముఖ్యంగా ట్రంప్ విధించిన గడువు ఇప్పుడు ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన దూకుడు ప్రదర్శించే ట్రంప్.. ఈసారి ఇరాన్ విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. సాధారణంగా దౌత్యపరమైన భాషలో ఉండే సుతిమెత్తని హెచ్చరికలను పక్కనపెట్టి.. నేరుగా విధ్వంసం గురించిన మాటలను ఆయన వాడుతున్నారు. ఇరాన్‌ను పూర్తిగా నామరూపాలు లేకుండా చేయగలమన్న ఆయన మాటలు ఆ దేశ పాలకులకు నేరుగా పంపిన హెచ్చరికలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రకటనలు వెలువడిన వెంటనే గల్ఫ్ దేశాలతో పాటు అగ్రరాజ్యాల రక్షణ విభాగాలు అప్రమత్తమయ్యాయి. ఒక దేశ ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా అగ్రరాజ్య అధినేత వ్యాఖ్యలు చేయడం గత కొన్ని దశాబ్దాల్లో ఇదే మొదటిసారిగా రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. హోర్ముజ్ జలసంధి వేదికగా సాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ గనుక వెంటనే ఆ జలసంధిని నిబంధనల ప్రకారం తెరవకపోతే ఊహించని పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇరాన్ మొత్తం ఒకే రాత్రిలో ముగిసిపోవచ్చు.. అది రేపే కావచ్చు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు యుద్ధం ముంగిట ఉన్నామా అనే సందేహాన్ని కలిగిస్తున్నాయి. తన సొంత సోషల్ మీడియా వేదికైన 'ట్రూత్ సోషల్'లో వరుస పోస్టుల ద్వారా ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా ట్యూజ్ డే రాత్రి ఎనిమిది గంటల లోపు నిర్ణయం తీసుకోవాలంటూ ఒక ఖచ్చితమైన సమయాన్ని నిర్దేశించడం ద్వారా ఇరాన్‌పై మానసిక ఒత్తిడిని పెంచారు. ట్రంప్ హెచ్చరికల వెనుక ఉన్న వ్యూహం కేవలం భయపెట్టడమే కాదని.. ఇరాన్ లోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఆ దేశంలోని పవర్ ప్లాంట్లు, వంతెనలు, ఇతర కీలక ప్రభుత్వ భవనాలపై సమన్వయంతో కూడిన దాడులు జరుగుతాయని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. "వారికి ఇకపై బ్రిడ్జ్‌లు ఉండవు.. పవర్ ప్లాంట్లు ఉండవు.. ఏమీ మిగలదు" అన్న వ్యాఖ్యలు ఆ దేశ ఆర్థిక, సామాజిక మూలాలను దెబ్బతీసే దిశగా అమెరికా ఆలోచిస్తోందని చెబుతున్నాయి. యుద్ధం గనుక సంభవిస్తే ఇరాన్ కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్లడం ఖాయమని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అగ్రరాజ్య సైనిక శక్తి ముందు ఇరాన్ ఎంతవరకు నిలబడగలదనే చర్చ ఇప్పుడు మొదలైంది. శాంతి స్థాపన కోసం మధ్యవర్తులు ప్రతిపాదించిన 45 రోజుల కాల్పుల విరమణ అంశంపై సైతం ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ఈ ప్రతిపాదన ఒక ముఖ్యమైన అడుగే అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితులకు అది ఏమాత్రం సరిపోదని ఆయన తేల్చి చెప్పారు. తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం తనకే ఉందని.. ఇరాన్ వైఖరిలో మార్పు రానంత వరకు ఇలాంటి తాత్కాలిక విరమణలు వృథా అని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ సైతం ఈ ప్రతిపాదన పట్ల సుముఖంగా లేదు. తాత్కాలికంగా యుద్ధాన్ని నిలిపివేయడం వల్ల శత్రువులు మరింత బలం పుంజుకుంటారని టెహ్రాన్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేస్తోంది.



ఇరు పక్షాలు పంతాలకు పోతుండటంతో మధ్యవర్తుల ప్రయత్నాలు నీరుగారిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్ పాలకులతో పాటు అక్కడి ప్రజలను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదానికి తెరలేపాయి. ఆ దేశ ప్రజలు తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తారని.. వారికి సరైన ఆయుధాలు అందితే పరిస్థితులు మారిపోతాయని ఆయన వ్యాఖ్యానించారు. "బాంబుల శబ్దమే వారికి స్వేచ్ఛకు మార్గం" అన్న మాటలు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒక దేశంపై బాంబుల దాడిని స్వేచ్ఛగా అభివర్ణించడంపై మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ఇరాన్ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ వ్యాఖ్యలు యుద్ధానికి ఆజ్యం పోసేలా ఉన్నాయని అంతర్జాతీయ సమాజం భావిస్తోంది. ఇది కేవలం పాలకుల మధ్య పోరు కాకుండా ప్రజలను సైతం ఇబ్బందుల్లోకి నెట్టే ప్రక్రియగా మారుతోంది. అగ్రరాజ్య ప్రయోజనాల్లో చమురు పాత్ర ఎప్పుడూ కీలకంగానే ఉంటుంది. ఇరాన్ చమురు నిల్వలపై తనకు ఆసక్తి ఉందని ట్రంప్ పరోక్షంగా అంగీకరించారు. అయితే అగ్రరాజ్య పౌరులు ఇలాంటి యుద్ధ చర్యను ఎంతవరకు సమర్థిస్తారనే సందేహాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. ఆర్థిక లాభం కోసం యుద్ధం చేయడం వల్ల కలిగే పర్యవసానాలపై అమెరికాలో సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఇంధన ధరలను అదుపులో ఉంచడం.. మరోవైపు యుద్ధ ఖర్చులను భరించడం మధ్య అమెరికా ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

# మూసీ పునర్జీవనంలో మత సామరస్యం


దూడం సంతోష్, పొలిటికల్ అనలిస్టు

**ఏం**డ్ల తరబడి గత ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూసీ చాలా ఇబ్బందికరంగా తయారైంది. అందుకే, మూసీ ప్రక్షాళన అత్యవసరం. హైదరాబాద్ నుంచి కాలుష్యం మూసీ నదిలో కలుస్తోంది. నల్గొండ వరకూ వెళ్తోంది. మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలు చాలా బాధపడుతున్నారు. పుట్టిన ఊరి నుంచి పిల్లలను బయటకు పంపే దుస్థితి ఈ ప్రాంతంలో ఉంది. మూసీ దుర్గంధంతో నల్గొండ ప్రజలతో పాటు రాజేంద్రనగర్ ప్రజలు సైతం పెద్ద ఎత్తున తిప్పలు పడుతున్నారు. గాంధీ సరోవర్ ప్రాంతంలో ఇటు, అటు ఉన్న ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునర్‌జీవనం చేపడుతుంటే ఇక్కడి ప్రాంత ప్రజలంతా స్వాగతం పలుకుతున్నారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు తరలిస్తున్నామని.... మూసీ దుస్థితి ప్రకృతి తప్పిదం కాదు, మానవ తప్పిదమని వ్యాఖ్యానించారు. దాంతోపాటు, మంచిరేవులలో, మూసీ నదీ తీరాన మచిలేశ్వర స్వామి, ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ శుభ కార్యక్రమానికి భూమిపూజ చేశారు.

**విశాలభారతి:**

**ఈ** మందిర పునర్ నిర్మాణం దైవ సంకల్పంగా ఇక్కడ అందరూ చర్చించుకుంటున్నారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం అని ఇక్కడ ప్రజలు చెప్పుకుంటున్నారు. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మూసీ ప్రక్షాళన చేయడమన్నది ఇప్పుడు నిత్యావసర వస్తువులకన్నా అత్యవసరం. పరీవాహక ప్రాంతాన్ని మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా, ప్రత్యేకమైన ధ్యానమందిరాలతో ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. చరిత్రను గమనించినప్పుడు నదీ పరీవాహన ప్రాంతాలు, సముద్ర తీరాల్లోని ప్రాంతాలు అభివృద్ధిని సాధించాయి. తెలంగాణ సముద్రతీరం లేని రాష్ట్రం. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, ఈసా నదులున్నా ఆ జలాలను సరిగా వినియోగించుకోకపోవడం వల్ల కొన్ని తరాలు నష్టపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరం కాలుష్యంతో జనజీవనం స్తంభించిపోయింది. రాష్ట్రపతి, ప్రధానమంత్రులు ఉండే ఢిల్లీలో యమునా నది కాలుష్యమై పారుతోంది. కాలుష్యం కారణంగా సెలవులు ప్రకటించడం, పెట్టుబడులు తరలిపోవడం వంటి పరిస్థితుల నుంచి మనం నేర్చుకోవలసిన అవసరం ఉందా లేదా. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ఒక వేదిక. మూసీ ప్రక్షాళనలో భాగంగా అత్యధిక ప్రాధాన్యత కలిగిన చార్మినార్ మక్కా మసీదు ప్రాంతంలో అద్భుతమైన మసీదును, గౌలిగూడ ప్రాంతంలో సిక్కు చరిత్ర ఉంది. స్వర్ణ దేవాలయం లాంటి దేవాలయం నిర్మాణం, ఉప్పల్ నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి నిర్మించనున్నాము. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు వేసి అడ్డుకోవడం సహేతుకం కాదు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు. అలా చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారు. ఇక చేసే పనిలో మంచి ఉంటే, ఎన్ని విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడని మనం నమ్ముతాం. మన చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. మూసీ పరివాహకంలో మతసామరస్యానికి చిహ్నంగా ఒక మసీదు, నాగోల్ ప్రాంతంలో ఒక చర్చిని ప్రభుత్వం నిర్మించబోతుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే ప్రకటించారు. గోదావరి జలాలను తరలించి మూసీలో నిరంతరం నీరు పారేలా చర్యలు తీసుకోవడం ప్రస్తుతం ఎంతగానో అవసరం. ఇప్పుడు మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర మనల్ని ఏమాత్రం క్షమించదు.

**సూ**ర్యుడి చుట్టూ భూమి తిరిగినట్టు... ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు మూసీ నది పునర్జీవనం చుట్టూ తిరుగుతున్నాయి. ఎందుకంటే, రాష్ట్ర ప్రభుత్వం.., సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు వెళ్ళడమే ప్రధాన కారణమని స్పష్టంగా చెప్పవచ్చు. కాగా, చారిత్రాత్మక మూసీ పునర్జీవనం ప్రాజెక్టులో మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్వ మత సామరస్యపూరిత అడుగులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తను చేస్తున్న బృహత్తర సంకల్పానికి సెక్యూలర్ పంథాను ఎంచుకోవడం సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. అందులో భాగంగా మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. ఎనిమిది ఎకరాల్లో రూ.700 కోట్లతో ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఆలయ నిర్మాణానికి డిజైన్‌ను మూసీ రివర్‌ఫ్రంట్ ఖరారు చేసింది. చారిత్రక వీరభద్రస్వామి ఆలయ సమీపంలో ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్మించ తలపెట్టారు. ఆలయంలో వంద అడుగుల గాలిగోపురాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 3డీ నమూనా కూడా విడుదలైంది. అయితే, మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయం నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడం అందరూ స్వాగతించాల్సిన విషయం. వాస్తవానికి చాలా మంది నుంచి ఈ అంశంలో సానుకూలత వ్యక్తం అవుతున్న పరిస్థితి నెలకొంది.







# మారుతున్న బాల్యం!

- ఆటలు మరిచి ఫోన్లకే అతుక్కుపోతున్నారు
- పిల్లలకు గ్యాడ్జెట్ల కంటే మీ ప్రేమే ముఖ్యం
- సోషల్ మీడియా వల్ల పిల్లల్లో ఆందోళన పెరుగుతోంది
- అపరిచితులతో స్నేహం ప్రమాదకరం
- సహనం తగ్గి మొండిగా మారుతున్నారు
- పిల్లలను ప్రకృతికి, ఆటలకు దగ్గర చేయాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో: నేటి ఆధునిక కాలంలో టెక్నాలజీ అనేది మనిషి జీవితంలో విడదీయలేని భాగమైపోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి పనికీ స్మార్ట్ ఫోన్ మీద ఆధారపడటం అలవాటుగా మారింది. పెద్దలే కాకుండా పసిపిల్లలు కూడా ఈ డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఒకప్పుడు పిల్లల అల్లరితో కళకళలాడే వీధులు నేడు నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి. దీనికి కారణం పిల్లలందరూ ఇళ్లలోనే ఉండి మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోవడమే. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రేపటి తరం శారీరక, మానసిక వికాసం కుంటుపడే ప్రమాదం ఉందని పోలీసు ఉన్నతాధికారి వీసీ సజ్జనర్ చేసిన హెచ్చరికలు ప్రతి తల్లిదండ్రికీ ఒక కనువిప్పులా మారాలి. సమాజంలో వస్తున్న మార్పులు పిల్లల బాల్యాన్ని మింగేస్తున్నాయి. పూర్వం వేసవి సెలవులంటే పిల్లలకు అదొక పండుగలా ఉండేది. అమ్మమ్మ, తాతయ్యల ఇళ్లకు వెళ్లి అక్కడ తోటి పిల్లలతో కలిసి గోలీలు ఆడటం, చెట్లు ఎక్కడం, కాలవల్లో ఈత కొట్టడం వంటి పనులు చేసేవారు. ఆ ఆటల వల్ల వారిలో సామాజిక స్పృహ, టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు పెరిగేవి. ప్రకృతితో గడపడం వల్ల మానసిక ప్రశాంతత లభించేది. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆ మధుర జ్ఞాపకాలన్నీ కనుమరుగైపోయాయి. ఐదు అంగుళాల స్మార్ట్ ఫోన్ లోనే ప్రపంచాన్ని వెతుక్కుంటున్న నేటి బాల్యం నాలుగు గోడల మధ్య బందీ అయిపోతోంది. తల్లిదండ్రుల అతి బిజీ లైఫ్ స్టైల్ పిల్లల పాలిట శాపంగా మారుతోంది. ఉద్యోగ బాధ్యతలు, వృత్తిపరమైన ఒత్తిళ్ల కారణంగా చాలామంది తమ పిల్లలకు తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు. పిల్లలు తమను ఇబ్బంది పెట్టకుండా ఉండాలని లేదా వారు అల్లరి చేయకుండా కూర్చోవాలని చేతికి మొబైల్ ఫోన్ ఇస్తున్నారు. ఇది తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా, దీర్ఘకాలంలో పిల్లలను డిజిటల్ బానిసలుగా మారుస్తోంది. తల్లిదండ్రుల ప్రేమ, పలకరింపు దొరకని చోట పిల్లలు సహజంగానే ఆ లోటును భర్తీ చేసుకోవడానికి ఇంటర్నెట్ లోని వర్చువల్ ప్రపంచాన్ని ఆశ్రయిస్తున్నారు. అక్కడ దొరికే కృత్రిమ ఆనందానికి వారు త్వరగానే అలవాటు పడిపోతున్నారు.

సోషల్ మీడియా వినియోగం పిల్లల్లో ఒక ప్రమాదకరమైన వ్యసనంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా తక్కువ సమయంలో ఎక్కువ గుర్తింపు పొందాలనే ఉద్దేశంతో చేసే 'రీల్స్' వారి ఆలోచనా దృక్పథాన్ని దెబ్బతీస్తున్నాయి. తాము పెట్టిన పోస్టులకు ఎన్ని లైకులు వచ్చాయి, ఎంతమంది కామెంట్ చేశారనే అంశాల మీదనే వారి ధ్యాస ఉంటోంది. లైకులు తక్కువగా వస్తే తీవ్ర నిరాశకు లోనవ్వడం, ఇతరులతో పోల్చుకుని కుంగిపోవడం వంటివి వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. చిన్న వయసులోనే ఇటువంటి భావోద్వేగాలకు లోనవ్వడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం తగ్గిపోతోంది. బయటి ప్రపంచంతో సంబంధం లేని ఒంటరి జీవులుగా వారు మిగిలిపోతున్నారు. ఆన్‌లైన్ ప్రపంచంలో పొంచి ఉన్న ముప్పులు అంతా ఇంతా కావు. ఇంటర్నెట్‌లో అపరిచితులతో స్నేహం చేయడం వల్ల పిల్లలు సైబర్ నేరగాళ్ల వలలో పడే అవకాశం ఉంది. సైబర్ నేరగాళ్లు పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారిని బ్లాక్ మెయిల్ చేయడం, అసభ్యకరమైన వెబ్‌సైట్లకు బానిసలుగా మార్చడం వంటివి చేస్తున్నారు. దీనివల్ల పిల్లలు తెలియని భయంలో బతుకుతూ ఎవరికీ చెప్పుకోలేక తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. గంటల తరబడి ఆన్‌లైన్ గేమింగ్‌లో మునిగిపోవడం వల్ల నిద్రాహారాలు మాని అనారోగ్యం పాలవుతున్నారు. ఈ డిజిటల్ వ్యసనం వారి కంటి చూపును దెబ్బతీయడమే కాకుండా మెదడు పనితీరుపై కూడా వ్యతిరేక ప్రభావం చూపుతోంది.



పిల్లల మానసిక స్థితి ప్రస్తుతం చాలా సున్నితంగా మారుతోంది. ఇంటర్నెట్‌లో చూస్తున్న హింసాత్మక కంటెంట్ వారి ప్రవర్తనలో మార్పులు తెస్తోంది. చిన్నపాటి మందలింపులకే లేదా కోరుకున్న వస్తువు కొనివ్వలేదనే నెపంతో మనస్తాపం చెంది ఇల్లు వదిలి వెళ్లిపోవడం, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటం వంటి ఘటనలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సహనం అనేది వారిలో నశిస్తోంది. ప్రతిదీ తక్షణమే జరిగిపోవాలని కోరుకుంటున్నారు. గ్యాడ్జెట్లపై పెంచుకుంటున్న అతిగా ఆధారపడటం వల్ల వారిలో సమస్యలను ఎదుర్కొనే శక్తి, సామాజిక నైపుణ్యాలు క్షీణిస్తున్నాయి. తోటివారితో ఎలా మాట్లాడాలి, ఎలా కలిసిమెలిసి ఉండాలి అనే ప్రాథమిక విషయాలు కూడా వారు మర్చిపోతున్నారు. వేసవి సెలవుల సమయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకు ఖరీదైన గ్యాడ్జెట్లు కొనివ్వడం గొప్ప అని భావించడం మానుకోవాలి. వాటికంటే విలువైనది మీ సమయం అని గుర్తించాలి. పిల్లలతో కలిసి గడపడం, వారితో కబుర్లు చెప్పడం, పాత తరం కథలు వినిపించడం వంటివి చేయాలి. వారిని బయటకు తీసుకువెళ్లి శారీరక శ్రమ ఉండే ఆటలు ఆడించాలి. కొత్త విషయాలను నేర్చుకునేలా ప్రోత్సహించాలి. అప్పుడే వారిలోని సృజనాత్మకత బయటకు వస్తుంది. డిజిటల్ స్క్రీన్ల నుంచి వారిని దూరం చేసి ప్రకృతికి దగ్గర చేసినప్పుడే వారు సంపూర్ణమైన మానసిక ఆరోగ్యంతో పెరుగుతారు. బాల్యం అనేది కేవలం స్మార్ట్ ఫోన్ కు పరిమితం కాకూడదు.

పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చూస్తున్నారు, ఎలాంటి యాప్‌లు వాడుతున్నారు అనే దానిపై నిరంతరం నిఘా ఉంచడం తల్లిదండ్రుల బాధ్యత. సాధ్యమైనంత వరకు 'పేరెంటల్ కంట్రోల్' ఆప్షన్లు వాడాలి. సోషల్ మీడియా వాడకానికి కొన్ని పరిమితులు విధించాలి. మొబైల్ వాడకం వల్ల కలిగే నష్టాలను వారికి సున్నితంగా వివరించాలి. సైబర్ భద్రత గురించి వారికి అవగాహన కల్పించాలి. అపరిచితులతో మాట్లాడటం ఎంత ప్రమాదకరమో వారికి అర్థమయ్యేలా చెప్పాలి. కేవలం ఫోన్ లాక్కోవడం వల్ల ప్రయోజనం ఉండదు, దానికి బదులుగా ప్రత్యామ్నాయ వ్యాపకాలను కల్పించాలి. అప్పుడే పిల్లలు స్వచ్ఛందంగా డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు రావడానికి ఆసక్తి చూపుతారు. పరీక్షా ఫలితాలు వచ్చే సమయంలో పిల్లలపై అనవసరమైన ఒత్తిడి పెంచకూడదు. మార్కుల కంటే జీవితం పెద్దదని, ఒక్క పరీక్ష ఫలితం భవిష్యత్తును నిర్ణయించదని వారికి భరోసా ఇవ్వాలి. ర్యాంకుల వేటలో పడి వారిలోని సహజ సిద్ధమైన టాలెంట్‌ను చంపేయకూడదు. వైఫల్యాలు ఎదురైనప్పుడు వారికి అండగా నిలబడి ధైర్యాన్ని నింపాలి. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే వారు ఏ విషయాన్నైనా భయం లేకుండా పంచుకుంటారు. ఇంట్లో స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఉంటే పిల్లలు బయటి వ్యక్తుల వైపు లేదా సోషల్ మీడియా వైపు మొగ్గు చూపే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇంటి నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించాలి.













నేటి తరానికి స్మార్ట్ ఫోన్ అనేది ఒక అవసరంగా మారింది, కానీ అది ఒక వ్యసనంగా మారకూడదు. సాంకేతికతను విజ్ఞానం కోసం వాడాలే తప్ప కాలాన్ని వృథా చేయడానికి కాదు. పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచడం అంటే వారిని వెనక్కి నెట్టడం కాదు, వారిని ఆరోగ్యవంతమైన సమాజం వైపు నడిపించడం అని గ్రహించాలి. విద్యావంతులైన తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో పొరపాట్లు చేయడం విచారకరం. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం నేడే మేల్కొనాలి. వారు కేవలం డిజిటల్ ప్రపంచంలో కాకుండా నిజమైన ప్రపంచంలో బతకడం నేర్చుకోవాలి. బంధాలు, అనుబంధాల విలువ తెలుసుకున్నప్పుడే వారు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిని పరిశీలించారు. స్లాబ్ పూర్తయిన ఇండ్లకు గృహ ప్రవేశాలు చేపట్టాలని, వంగపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు మౌలిక వసతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహణ




**యాదాద్రి భువనగిరి, విశాలభారతి :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా హెల్త్ వీక్-డే2 కార్యక్రమం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. "ఆరోగ్యం కోసం కలిసికట్టుగా - విజ్ఞానానికి అండగా నిలబడదాం" నినాదంతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రులు ఎన్క్యూఏఎస్ సర్టిఫికేషన్‌కు సిద్ధంగా ఉండాలని సూచిస్తూ, ఉత్తమ సేవలు అందించిన 68 మంది ఆరోగ్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జడ్పీ సీఈవో శోభారాణి, డీఎంహెచ్‌వో డా. మనోహర్, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించిన కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** భువనగిరి పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. గ్రంథాలయాల పరిస్థితి, సదుపాయాలపై అధికారులతో చర్చించి, పాఠకులకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాట్లాడి అవసరమైన పుస్తకాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, సెక్రటరీ, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**మోత్కూరు, విశాలభారతి :** చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం వస్తే అంబేద్కర్ అభయ హస్తం క్రింద రాష్ట్రంలో ఉన్నట్టువంటి ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ఇస్తానన్న హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి,,జిల్లా ఇంచార్జి కూరెళ్ల రమేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మోత్కూరుకు వచ్చిన మంగళవారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాదిగ మాట్లాడుతూ దళితులకు మూడు ఎకరాల భూమి, జీవో నెంబర్ 58,59 హక్కు చట్టం కల్పిస్తూ పట్టాలు అమ్ముకునే హక్కును కల్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు 4వ, తరగతి ఉద్యోగుల క్రింద గుర్తించి 20వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. లీడ్ క్యాష్ పునరుద్ధరణ, తోళ్ల పరిశ్రమలను ఏర్పాటు చేసే మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ కు 15 వేల కోట్ల రూపాయలను మంజూరు చేసి ఏలాంటి ఆక్షేపం లేకుండా నేరుగా ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల రూపాయలు బ్యాంక్ రుణం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో 25% ఉచిత విద్యను అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఈ హామీలను తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రమేష్ మాదిగ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు మాదిగ, మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసగాళ్ల రమేష్, జిల్లా కార్యదర్శి కొంపల్లి భాస్కర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగి స్వామి,ఎం.ఎస్.ఎఫ్.జిల్లా కన్వీనర్ కొంపల్లి వెంకట్, ఆత్మకూరు (ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు బోట్ల అనిల్ ,కూరెళ్ల సైదులు, ఇటికాల ఆంజనేయులు, నాయకులు కూరెళ్ళ ఉదయ్, నత్తి కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడిలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

**ఎమ్మెల్యే సామేల్**



**మోత్కూరు, విశాల భారతి :** అంగన్వాడీలో పిల్లలకు, పౌష్టికాహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ కోరారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ఆధ్వర్యంలో సూపర్వైజర్, అంగన్వాడి టీచర్లకు రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న చరవాణి (స్మార్ట్ ఫోన్లు) ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అంగన్వాడీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వాటిని టీచర్లు సూపర్వైజర్లు పిల్లలకు బాలింతలకు తూ.చ. తప్పకుండా అందజేసేలా చూడాలన్నారు.అంగన్వాడి పిల్లలకు, బాలింతలకు అందించే పోషకాహారాలను ఈ స్మార్ట్ ఫోన్ల లోనే నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యూ ఓ నర్సింహ్మా రావు, సిడిపిఓ యామిని, తహశీల్దార్ పి.జ్యోతి,ఎంపీడీవో బాలాజీ నాయక్, మున్సిపల్ కమీషనర్ కే సతీష్‌కుమార్ ,మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ లింగాల నర్సిరెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కురిమిళ్ళ ప్రమీల, గనగాని శైలజ,పన్నాల శ్రీవిద్య సూపర్వైజర్లు జ్యోతి, మధురమ్మ, షమీంవాణి, యాకు పాషా అంగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పిడమర్తి బాబురావుకు దళిత రత్న పురస్కారం



**కోదాడ, విశాలభారతి :** కోదాడ పట్టణానికి చెందిన పిడమర్తి బాబురావు దళితరత్న పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల్లో ఎంఆర్పిఎస్ నాయకులు పిడమర్తి బాబురావు మాదిగకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ మాదిగ చేతుల మీదుగా ఆయన ఈ దళిత రత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మేడి పాపన్న, చింతాబాబు మాదిగల ఆధ్వర్యంలో సాగిన మలిదశ ఉద్యమంలో బాబురావు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. కాగా తనకు ఈ పురస్కారం లభించేందుకు సహకరించిన జిల్లా అధ్యక్షులు పాల్లేటి లక్ష్మణ్ మాదిగ, బచ్చలకూరి నాగరాజు మాదిగ లతో పాటు రాష్ట్ర, జిల్లా, కోదాడ ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి కార్యవర్గ సభ్యులుగా బొల్లంపల్లి రామ్ రెడ్డి



ముషీరాబాద్,విశాల భారతి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ముషీరాబాద్ కు చెందిన బొల్లంపల్లి రామ్ రెడ్డి నియామకమయ్యారు. బిజెపి పార్టీ కోసం అంకితభావంతో 38 సంవత్సరాలుగా పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యవర్గ సభ్యుడుగా ప్రకటించినందుకు డాక్టర్ కె లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతం కోసం పాటుపడతానని చెప్పారు.

# రూ. 1.20 లక్షల కోట్లు గోదావరి పాలు

- కాళేశ్వరంపై టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు
- అబద్ధాలు ఆడటంలో కేటీఆర్‌కు 'నోబెల్' ఇవ్వొచ్చు
- కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం
- అమెరికాలో కేటీఆర్ పచ్చి అబద్ధాలు ఆడారు
- దేశ సంపద అదానీ, అంబానీల పాలు
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఏది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్ల దోపిడీ పేరిట లక్షా ఇరవై వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని గోదావరి పాలు చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించామని చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కుప్పకూలే స్థితికి చేరుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' పేరుతో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన డీసీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో అవకాశాలు అందరికీ రావని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పదవికి వన్నె తేవాలని మహేశ్ కుమార్ గౌడ్ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన కుల గణన సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని, సామాజిక న్యాయం దిశగా ఇదొక గొప్ప అడుగు అని ఆయన కొనియాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 53 శాతం సీట్లు కేటాయించి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటుకుందని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అబద్ధాలు ఆడటంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు నోబెల్ బహుమతి ఇవ్వవచ్చని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. అమెరికాలోని కొలంబియా బిజినెస్ స్కూల్‌లో కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని విదేశీ గడ్డపై ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఆ ప్రాజెక్టు పరిస్థితి దారుణంగా ఉందని, కేవలం కమిషన్ల కోసమే రీడిజైనింగ్ పేరుతో నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా విస్మరించారని, ఆ పార్టీ కథ ముగిసిన ముచ్చటగా ఆయన అభివర్ణించారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించిన నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంపై విమర్శలు చేస్తూ కేసీఆర్ ప్రస్తుతం ఫాం హౌస్‌కే పరిమితం అయ్యారని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సంతోష్ రావు తన సొంత వ్యవహారాలతో సంతోషంగా ఉన్నారని, కవిత వేరు కుంపటి పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో అక్రమంగా సంపాదించుకున్న వాటాలను పంచుకోలేని దుస్థితిలో ఆ పార్టీ నేతలు ఉన్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా పేదలను ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించడమే కాకుండా, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని గర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా టీపీసీసీ చీఫ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశ సంపదను అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెట్టడమే ప్రధానమంత్రి మోదీ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ నమ్మబోరని, ఆ పార్టీ రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించిందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా దక్షిణ తెలంగాణకు జీవనాడి వంటి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని తాము మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ ఈ ప్రాజెక్టుకు హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నిధుల కేటాయింపులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తన పరిమిత వనరులతోనే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు శ్రమిస్తోందని మహేశ్ వివరించారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు రక్షించుకోండి



- ఒక హెల్మెట్... ఒక కుటుంబానికి భరోసా
- నిర్లక్ష్యం కాదు భద్రత ముఖ్యం.. హెల్మెట్ తప్పనిసరి
- కురవి ఎస్సై గండ్రాతి సతీష్ పిలుపు

**కురవి, విశాలభారతి:**

రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను రక్షించే ముఖ్యమైన రక్షణ సాధనమని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శబరిష్ సూచనల మేరకు మంగళవారం మండలంలోని పిల్లిగుండ్ల తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ రమేష్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన హెల్మెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై సతీష్, మాజీ జడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్, మహబూబాబాద్ జిల్లా మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ లు యువకులకు హెల్మెట్ లు పంపిణీ చేశారు. అనంతరం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్సై సతీష్‌తో పాటు హెల్మెట్ లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు కేవలం వ్యక్తిగత నష్టమే కాకుండా కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రమాదం కారణంగా కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువకులు ఎక్కువగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరమని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్న తమ పిల్లలను కోల్పోవడంతో వారి జీవితాల్లో తీరని లోటు మిగులుతోందని, కడుపుకోతతో మిగిలిపోతున్నారని చెప్పారు. చిన్న నిర్లక్ష్యం వల్ల కుటుంబాల భవిష్యత్తు చీకటిలోకి వెళ్లే పరిస్థితులు వస్తున్నాయని హెచ్చరించారు. అలాగే వేగ పరిమితులు అతిక్రమించడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక డ్రైవ్‌లు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామాల్లో అనుమానం వస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని, వారి పేరు బయటకు రాకుండా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రాణం అమూల్యమని, క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం నష్టాన్ని మిగులుస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ ప్రాణాలతో పాటు కుటుంబ సభ్యుల ఆశలను కూడా కాపాడాలని ఎస్సై గండ్రాతి సతీష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, భరద్వాజ్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ప్రజానాట్యమండలి**

**ఆలేరు, విశాల భారతి :**

తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం ఈరోజు ఆలేరులోని ఆర్య వైశ్య భవనంలో జిల్లా అధ్యక్షులు భూష్పాక నరసింహ అధ్యక్షతన నిర్వహించబడింది.సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు కే. శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ప్రసంగంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాకారులకు ప్రభుత్వం తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని గ్రామాల్లోని వివిధ వృత్తుల కళాకారులకు సరైన గుర్తింపు లేక కలలు కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా అర్హులైన పేద కళాకారులు, కవులకు ఇప్పటికీ సరైన ప్రాధాన్యం దక్కలేదని విమర్శించారు.సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కళ కళ కోసం మాత్రమే కాకుండా ప్రజల చైతన్యం కోసం ఉండాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కష్టసుఖాలను ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా కళాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన పేద కళాకారులకు గుర్తింపు కార్డులతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధ కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలని కోరారు.కళాకారుల కుటుంబాలకు విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మూలపోషయ, పోతు ప్రవీణ్, కట్ల యాదగిరి, సోమ నరసయ్య, ఇంజ హేమలత, నర్సింలు, సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, రాజు, అప్పఎలేంద్ర, కవిత, పద్మ, కిష్టమ్మ, కలమ్మ, అనురాధ, వసంత, తేజ, విజయ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదం .. ఆటోను ఢీకొన్న కారు

**ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి.**



**విశాలభారతి , గోదావరిఖని:** గోదావరిఖని నగర శివారులోని డిగ్రీ కళాశాల రాజీవ్ రహదారి పై మంగళ వారం తెల్లవారుజామున ఆటో ని కార్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ ఎండి ఇస్మాయిల్ (40) రోడ్డు పై ఉన్న డివైడర్ ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ ల కథనం ప్రకారం..మంగళ వారం తెల్లవారు జామున రామగుండం ముబారక్ నగర్ కు చెందిన ఎండి.ఇస్మాయిల్ తన ఆటో లో ఎన్టీపీసీ నుంచి గోదావరిఖని బస్టాండ్ వైపు బిజిలీ రాధ అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలి తో వస్తున్న క్రమంలో కళ్యాణ్ నగర్ కు చెందిన బొంకూరి పవన్ కుమార్ హైదరాబాద్ కు తన మిత్రులైన చిరంజీవి ,రాజేష్‌తో స్విఫ్ట్ డిసైర్ కార్ లో వెళ్లి వస్తూ .గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగుండా వెళ్తున్న ఆటో ను వెనకవైపు నుంచి వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆటో,కారు రెండు రహదారి పై బోల్తా పడ్డాయి.దీంతో ఆటో నడుపుతున్న ఇస్మాయిల్ ఎగిరి కిందపడి తన తల రోడ్ పక్కన గల డివైడర్ కు తగిలింది .దీంతో తీవ్ర రక్త గాయాలతో ఇస్మాయిల్ అక్కడికక్కడ మృతి చెందగా,ఆటో లో ప్రయాణిస్తున్న బిజిలి రాధ అనే ప్రభుత్వ ఉద్యోగిరాలికి తలకు గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ కు తరలించారు.కార్ లో ప్రయాణిస్తున్న పవన్ కుమార్ చిరంజీవి రాజేష్‌లకు స్వల్ప గాయాల తో బయట పడ్డారు.మృతి చెందిన ఇస్మాయిల్ కు భార్య ,ఇద్దరు కూతుర్లు ఉండగా.మృతిని సోదరుడు ఎండీ.ఇబ్రహీం ఇచ్చిన పిర్యాదు మేరకు గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్ర సేన రెడ్డి పవన్ కుమార్ పై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## తట్యీతండ గ్రామంలో భద్రతకు పెద్దపీట

**సీసీ కెమెరాల ఏర్పాటు.. సర్పంచ్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో**



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్యీతండ గ్రామ పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్‌తో పాటు గ్రామంలోని వివిధ ముఖ్య కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచడం, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రమేష్ నాయక్ ప్రత్యేక చొరవతో నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనులను ఆయన స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తూ, గ్రామానికి ఉపయోగపడే విధంగా అన్ని కీలక ప్రాంతాల్లో కెమెరాలు అమర్చేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో రోజు రోజుకూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న సర్పంచ్ రమేష్ నాయక్, ఈ నిఘా వ్యవస్థ ద్వారా గ్రామంలో భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చాలా అవసరమని, దొంగతనాలు, గొడవలు, అనుచిత ఘటనలు, రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలపై నియంత్రణ సాధించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గ్రామ ప్రధాన సెంటర్లలో కెమెరాలు ఉండటం వల్ల ప్రజలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భక్యా బాలాజీ, వార్డు సభ్యులు వెంకన్న, నగేష్, సుధాకర్, విజయ్, రమేష్, సాగర్, వీరన్న, రంజిత్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని గ్రామ ప్రజలు కోరారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి. మాధవీలత జిల్లాలోని మాదాపూర్, మాల్యాల గ్రామాలలోని బాలల సంరక్షణ కేంద్రాలను మంగళవారం సందర్శించి వసతులను పరిశీలించారు. చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌ల నిర్వహణపై నిర్వాహకులకు సూచనలు చేసి, బాలబాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఫాస్ట్ ఫుడ్, అధిక మొబైల్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నియంత్రించాలని సూచించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యంగా జీవించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని తెలిపారు. భువనగిరి ప్రభుత్వ పట్టణ వైద్యశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, డాక్టర్లు నిర్మల, శ్రీదేవి, విజయ్ పటేల్, ప్రీతిస్వరూప్, డేవిడ్ తదితరులు ఆరోగ్య సమస్యలు, నివారణ చర్యలపై వివరించారు. అలాగే మాదాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి వరకట్న నిషేధం, గృహ హింస చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో న్యాయవాదులు, వైద్యులు, మహిళలు పాల్గొన్నారు.

## 80 పశువులకు ఉచిత టీకాలు

**పశువైద్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలం గుండ్లగూడ గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమానికి మండల పశువైద్యాధికారి చైతన్య హాజరై గ్రామంలోని సుమారు 80 పశువులకు ఉచితంగా టీకాలు వేసి, పశుసంవర్ధకంపై రైతులకు అవగాహన కల్పించారు.పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి సమయానికి టీకాలు వేయించుకోవడం అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ మైదం రంగయ్య, ఉప సర్పంచ్ కేతావత్ సాయి నాయక్, వార్డు సభ్యుడు ఆలేటి నాగార్జున, సిబ్బంది స్వామి, రమ తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి మోడల్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు



**కూకట్ పల్లి విశాలభారతి:** కూకట్పల్లి కేపీహెచ్ బి కాలనీ గీతాంజలి మోడల్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ లు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు సందడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ రవిబాబు మాట్లాడుతూ మా స్కూల్లో ఎటువంటి సెలబ్రేషన్స్ ఉన్న వాటిని తూచ తప్పకుండా నిర్వహిస్తుంటాము అలాగే విద్యార్థులకు క్రమశిక్షణ తల్లిదండ్రులతోటి అలాగే గురువులు పెద్దలు తోటి ఎలా నడుచుకోవాలో టీచర్స్ ఎంతో బాధ్యతగా చెప్పడం జరుగుతుంది.ఈ సెలబ్రేషన్ లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి విద్యార్థులకు సర్టిఫికెటు మెమొంట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ అలాగే విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొనడం జరిగినది.

## అనేక సంక్షేమ పథకాలను అందించింది బిఆర్ఎస్ పార్టీయే



**ముషీరాబాద్,విశాల భారతి:** పేద ప్రజలకు లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలలను అందించింది బిఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ జన్మదినం సందర్భంగా తార్నాక చౌరస్తాలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కాజా పాషా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరావు, రాజ నరసింహ, యాకూబ్, మధుకర్, శివ, మనోహర్, గౌస్, సునీల్ ముదిరాజ్, నాగరాజ్ గౌడ్, ఎర్ర నాగు, వంజరి వెంకటేష్, జింకల మల్లేష్, యాదగిరి, పురుషోత్తం, స్టాలిన్, స్మిత, రాకేష్, శ్యామ్, అరుణ్, అంబల రమేష్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎవరు కూడా ఇబ్బంది పడొద్దు అనే ఆలోచన చేసేది ఒక పద్మారావు గౌడ్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన కలిగిస్తున్న డ్రగ్స్




**ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు**

**ముషీరాబాద్,విశాల భారతి:** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు డ్రగ్స్ విస్తరిస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు ఆందోళన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని ఆరోపించింది. సోమవారం లిబర్టీలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగరంలో డ్రగ్స్ సులభంగా లభించడం చాలా ప్రమాదకరమన్నారు. ఇది కేవలం చట్ట వ్యవస్థ వైఫల్యం మాత్రమే కాకుండా సమాజానికి పెను ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు కళాశాల దగ్గర కూడా డ్రగ్స్ అందుబాటులో ఉండడం అత్యంత ప్రమాదకరమని డ్రగ్స్ మాఫియా పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక టాస్క్ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రాకెట్ను పూర్తిగా నిర్మూలించి యువతను రక్షించడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాము గౌడ్, మామిడి చెట్టు శివాజీ తదితరులు ఉన్నారు.

## రోడ్డు సమస్యల పరిష్కారానికి కృషి

**అధికారులతో కలిసి పర్యవేక్షించిన తుంగతుర్తి రవి**



**మేడిపల్లి, విశాలభారతి:** మేడిపల్లి 9వ డివిజన్ పరిధిలోని SFS స్కూల్ నుండి పర్వతపూర్ CPRI రోడ్డులోని సాయి ఐశ్వర్య కాలనీ (రోడ్డు నెంబర్ 3) వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారై, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి గారు ఈరోజు మున్సిపల్ అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎన్నిసార్లు రోడ్డు వేసినప్పటికీ, డ్రైనేజీ మరియు వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోవడం వల్ల తరచూ గుంతలు పడుతున్నాయని పేర్కొన్నారు. నీరు నిలవకుండా ఉండేందుకు రోడ్డును తగినంత ఎత్తుకు పెంచాలి. నీరు సాఫీగా వెళ్లేందుకు కొత్తగా మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలి. నాణ్యమైన పద్ధతుల్లో రోడ్డు నిర్మించి, భవిష్యత్తులో గుంతలు పడకుండా చూడాలని అధికారులతో మాట్లాడి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## 15 ఏళ్ల బాలుడు గల్లంతు

**విశాలభారతి:** పాలమాకుల గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలుడు వరికుప్పల అనిల్ కుమార్ గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వరికుప్పల అనిల్ కుమార్ (తండ్రి: మల్లేష్) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గత వారం రోజులుగా స్కూల్కు వెళ్లకుండా గ్రామంలోని చెరువులో ఇతర పిల్లలతో కలిసి ఈత కొట్టడానికి వెళ్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై తల్లి అతన్ని మందలించి, క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లాలని సూచించింది. ఈ నెల 6వ తేదీ ఉదయం సుమారు 5:30 గంటలకు తల్లి పనిమీద బయటకు వెళ్లగా, అప్పటికి అనిల్ ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి అనిల్ కనిపించలేదు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఎక్కడా అతని ఆచూకీ లభించలేదు. బాలుడి వివరాలు ఇలా ఉన్నాయి: ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ వర్ణం, బ్లూ కలర్ షర్ట్, చాక్లెట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలుడి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని పోలీసులు ప్రజలను కోరుతున్నారు.

## డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనం ప్రారంభం

- **ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**
- **కళ్లెం నవజీవన్ రెడ్డి తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ డివిజన్లో నూతనంగా నిర్మించిన డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనంను ఘనంగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి , హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. డిఫెన్స్ కాలనీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ సంఘ భవనం కాలనీ అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ భవనం ద్వారా కాలనీవాసులకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుకూల వేదిక లభిస్తుందని అన్నారు. కాలనీ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందరూ కలిసికట్టుగా కాలనీ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టి పి సి సి కార్యదర్శి గజ్జి భాస్కర్, బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్,బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, కాలనీ అధ్యక్షుడు సురేష్, సంఘ సభ్యులు శ్రవణ్, సోమేశ్వర్ రావు, నర్సింహా, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వర్ రావు, రాఘవేంద్ర రెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- **సీపీ అంబర్ కిషోర్ ఝా**
- **పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష**
- **వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు**

**విశాలభారతి , గోదావరిఖని:**




రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు.దొంగతనాల నివారణ మరియు కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు.రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని,ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు,కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

## కోహెడ పండ్ల మార్కెట్పై దుష్ప్రచారం



- **చిలుక మధుసూదన్ రెడ్డి**
- **రైతులను మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ది**

**విశాలభారతి,అబ్దుల్లాపూర్మెట్ :**

కోహెడ పండ్ల మార్కెట్ అంశంపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అబద్ధపు ప్రచారం చేస్తూ రైతులు, వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. బి ఆర్ ఎస్ పార్టీకి రైతులను మోసం చేసిన చరిత్ర ఉందని, ఇప్పుడు కూడా అదే తంతు కొనసాగిస్తోందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మంగళవారం తొర్రూరులో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడిన ఆయన... కోహెడ మార్కెట్ను సర్వం ముంచింది బి ఆర్ ఎస్ పాలనే. ఇప్పుడు మళ్లీ అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇక సహించేది లేదని హెచ్చరిస్తూ... ఇంకోసారి తప్పుడు ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అని గట్టిగా హెచ్చరించారు. కోహెడలో పండ్ల మార్కెట్ కోసం 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 178 ఎకరాల భూమి కేటాయించిందని గుర్తు చేస్తూ, గడిచిన 10 సంవత్సరాల బి ఆర్ ఎస్ పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. కరోనా పేరుతో కొత్తపేట మార్కెట్ను రాత్రికి రాత్రే రోడ్డుమీదకు నెట్టేసి, కమీషన్ల కోసం నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. టెంట్లు వేసి మార్కెట్ పేరుతో నాటకాలు ఆడారు... ఒక్క గాలివానకే అవి ఎగిరిపోయాయి. తర్వాత కోట్ల రూపాయలు ఖర్చు చేసి బాటసింగారం లాజిస్టిక్ పార్క్కు తరలించారు. అప్పుడే మార్కెట్ నిర్మాణం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న భూమిని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం TGIICకి ఇచ్చినట్లు స్పష్టం చేస్తూ, అదనంగా మరో 239 ఎకరాలు మార్కెట్ అభివృద్ధికి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, అంతర్జాతీయ స్థాయి ఎగుమతులు సాధించడం లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొంటూ... రెండు వేర్వేరు స్థలాలు మార్కెట్ అభివృద్ధి కోసం వినియోగిస్తాం. ఒకటి హోల్ సేల్ వ్యాపారానికి, మరొకటి అంతర్జాతీయ స్థాయి ఎగుమతుల కేంద్రంగా అభివృద్ధి చేస్తాం అన్నారు. బి ఆర్ ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా పచ్చి అబద్ధాలని ఖండిస్తూ... దమ్ముంటే రైతులతో, మార్కెట్ వ్యాపారులతో నేరుగా మాట్లాడాలి... రియల్ ఎస్టేట్ దందాలు చేసేవారితో కాదు అని సవాల్ విసిరారు. ఇకపై కోహెడ పండ్ల మార్కెట్పై ఎలాంటి దుష్ప్రచారం జరిగినా సహించబోమని స్పష్టం చేస్తూ, త్వరలోనే అంతర్జాతీయ స్థాయి మార్కెట్కు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. రైతుల భూముల విషయంలో పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి,సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి మరియు పలువురు వ్యాపారులు స్థానిక నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

**26 క్వింటాళ్లు స్వాధీనం – నిందితుడి అరెస్ట్**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**



పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. అప్రమత్తంగా వ్యవహరించిన నాగోల్ పోలీసులు వాహన తనిఖీలలో భాగంగా 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించిన వివరాల ప్రకారం... ఉమ్మడి నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం పెన్ పహాడ్ గ్రామానికి చెందిన రవి నాయక్ అనే వ్యక్తి టీఎస్ 30 టీఏ 4286 నంబర్ గల టాటా ఏస్ వాహనంలో భారీగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా శంషాబాద్ ప్రాంతానికి తరలిస్తున్నాడు. మంగళవారం నాగోల్ చౌరస్తా వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీలలో భాగంగా అనుమానం కలగడంతో పోలీసులు సంబంధిత వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో వాహనంలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు.

పరిశీలనలో వాహనంలో సుమారు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు, శంషాబాద్ ప్రాంతంలోని ఇటుక బట్టీలలో పనిచేసే కూలీలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు నిర్ధారించినట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే ఈ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి లాభాపేక్షతో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై నిందితుడిపై 7 ఈసీ పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్కు తరలించారు. ఇలాంటి అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పదంగా రేషన్ సరుకుల తరలింపును గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని సూచించారు.

## కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**విశాలభారతి:** కరకగూడెం మండలంలోని ఎంఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు 29 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 29,03,364 విలువైన కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆర్థికంగా బలహీన వర్గాల అమ్మాయిల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్, ఎం ర్ ఓ , ఎంపీడీఓ , ఎం ఈ ఓ , ఎంపీవో , హౌసింగ్ ఏఈ , ఏపీఎం , మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, ఎర్ర సురేష్, రాందాస్ నాయక్, జలగం క్రిష్ణ, పోలేబోయిన తిరుపతయ్య, నాగబండి వెంకటేశ్వర్లు, తొలెం నాగేశ్వరరావు, పడిగ సమ్మయ్య, నేతాజీ, సాగర్, షేక్ రఫీ గారు, సర్పంచ్లు, మండల అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## జార్జి రెడ్డి ఆశయాలతో విద్యార్థి ఉద్యమాలు బలోపేతం కావాలి

**పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఉదయ్ కుమార్ పిలుపు**




**ఆలేరు, విశాల భారతి :** ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి ఉద్యమాల నేత జార్జ్ రెడ్డి 54వ వర్ధంతి సభలను ఏప్రిల్ 10 నుంచి 14 వరకు వాడవాడన ఘనంగా నిర్వహించాలని పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆలేరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జార్జి రెడ్డి వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, జార్జి రెడ్డి ఆశయాలు నేటి విద్యార్థి ఉద్యమాలకు మార్గదర్శకమని అన్నారు.సమానత్వం, సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.విద్యార్థులు జార్జి రెడ్డి చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు షబ్బీర్, అరవింద్, వినయ్, గణేష్, సిద్ధార్థ, వంశీకృష్ణ, తరుణ్, రాజు, మల్లేష్, శివ, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి , అంతర్గం:** అంతర్గాం మండలానికి చెందిన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరోసారి తన ప్రజాహితాన్ని చాటుకున్నారు. మంగళవారం మొత్తం 8 మంది లబ్ధిదారులకు రూ. 2,27,000 (రెండు లక్షల ఇరవై ఏడు వేలు) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న మరియు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉపశమనం కలిగించడమే లక్ష్యమని అన్నారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమకు అత్యవసర సమయంలో అందించిన ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి , గోదావరిఖని:** గోదావరిఖని జవహర్ నగర్లోని 54వ డివిజన్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని 54వ డివిజన్ కార్పోరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో నిర్వహించగా, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు, మేయర్ మహంకాళి స్వామి గారు, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి ముగ్గు పోశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలను కలిసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు



**విశాలభారతి , అంతర్గం:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు వారి సతీమణి మనాలి ఠాకూర్ మరోసారి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. రాజ్ ఠాకూర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్గం మండలం పెద్దంపేట గ్రామంలో కొనసాగుతున్న 100 రోజుల పనుల వద్ద కూలీలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతల మధ్య కష్టపడి పని చేస్తున్న కూలీలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో సేవా సమితి తరపున టోపీలు మరియు గ్లూకోజ్ నీటిని పంపిణీ చేశారు. కూలీల ఆరోగ్యం, శ్రేయస్సు తమకు ముఖ్యమని, అవసరమైన ప్రతి సహాయాన్ని అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.ఈ సేవా కార్యక్రమంపై కూలీలు ఆనందం వ్యక్తం చేస్తూ, అవసరమైన సమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కి మరియు వారి సతీమణికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ అసోసియేట్ డీన్ అరెస్ట్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్‌ను అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం, విత్తన లైసెన్స్ మంజూరు చేయడానికి రూ.1 లక్ష లంచం డిమాండ్ చేసిన ఆయన, ముందుగా రూ.25 వేల లంచాన్ని స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ఆయనను పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రసాయన పరీక్షలో డాక్టర్ గోవర్ధన్ చేతివేళ్లు పాజిటివ్‌గా తేలినట్లు అధికారులు వెల్లడించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన పనుల కోసం అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఈ ట్రాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఏసీబీ సిటీ రేంజ్ II యూనిట్ విజయవంతంగా నిర్వహించింది. అరెస్ట్ చేసిన నిందితుడిని నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అవినీతి సంబంధిత ఫిర్యాదులు ఉన్నవారు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఏసీబీ సూచించింది.

# 47 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు




**ముషీరాబాద్,విశాల భారతి:** చదువుకుంటున్న సమయంలో బాల్య మిత్రులను గుర్తుంచుకొని ఒక్కొక్కరిని వెతుక్కుంటూ 47 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్క దగ్గర కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని అప్పటి జ్ఞాపకాలు ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఆత్మకూరు మండలం పరిధిలోని ఇస్తాలపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల 197986 ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు సాగి అప్పారావు, మర్రు బాబురావు,గణపరపు పుల్లయ్య, గోగుల సుధాకర్ రెడ్డి లను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి బాలలే భవిష్యత్తు తరాలకు రథసారథులు అన్న నాటి మా మాటలు నేడు నిజం చేసి చూపించినందుకు మీకు చెప్పిన చదువులకు మార్గదర్శకులుగా నిలిచినందుకు సంతృప్తిగా ఉందని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులైన తూడి నరసింహారావు,మర్రు మధుసూదన రావు, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, మర్రు వెంకటేశ్వరరావు, రవీందర్ రావు, మందాడి శ్రీనివాస్ రెడ్డి, తూడి భాస్కర్, వెంకన్న, కత్తి వెంకన్న, ఎస్కే సైదులు, సాగి వెంకటేశ్వరరావు, కటకం శ్రీనివాస్, సాగి శ్రీనివాసరావు, మెట్టు రామారావు, పాలంపల్లి వెంకన్న, సాగి లక్ష్మీ రాణి, ఆకుల రమణ, మర్రు శాంత, కత్తి జానకమ్మ, ఇమ్మడి చంద్రకళ, బండ పద్మ, మందాడి సులోచన పాల్గొన్నారు.

# త్యాగాల సీపీఐకి విరాళాలు అందించండి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** ప్రజా పోరాటాలతో వందేళ్లు పూర్తి చేసుకున్న కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)కు ప్రజలే విరాళాలు అందించి ఆదుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మెట్టు మండల కేంద్రంలో మంగళవారం సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పీడిత ప్రజల తరఫున నిరంతరం పోరాటాలు చేస్తూ వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే పార్టీని ప్రజలే తమ వంతు సహకారంతో నిలబెట్టాలని, విరాళాలు అందించి పార్టీకి బలం చేకూర్చాలని కోరారు. ఈ నెల 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అన్ని గ్రామాలు, ప్రాంతాల్లో ఈ విరాళాల సేకరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మెట్టు కేంద్రంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి విరాళాలు అందించారని చెప్పారు. కార్మికులు, రైతుల పక్షాన, పీడిత వర్గాల తరఫున సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, ఏషాల నరసింహ, పోన్నాల యాదగిరి, అరుణ, నవనీత, ఈశ్వర్, ధూపం మధు, సుజాత, నిరంజన్, దేవమ్మ, రాములు, రమేష్, యాదగిరి, మధు, వినోద్ నాయక్, వీరేష్, సాయిలు, లక్ష్మణ్, లక్ష్మి, మండల కౌన్సిల్, కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు




**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు మంగళవారం (ఏప్రిల్ 7, 2026) కఠిన చర్యలు తీసుకున్నారు. మొత్తం 24 కేసులను పరిష్కరించి రూ.48,000 జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసుల్లో ఇద్దరిని రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ముందు హాజరుపరచగా, వారికి ఒక్కరోజు సాధారణ కారాగార శిక్షతో పాటు వరుసగా రూ.3,500 మరియు రూ.4,000 జరిమానాలు విధించారు. అదనంగా 11 మందిపై డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసుల్లో రూ.27,000 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన రెండు కేసుల్లో రూ.3,000, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ చేసిన ఎనిమిది కేసుల్లో రూ.9,500 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్ కేసులో వాహన యజమానికి రూ.1,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, లేకపోతే ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# బీసీ జన జాగరణ జాతరకు ఆహ్వానం

**ఎంఎల్సీ బసవరాజు సారయ్యను కలిసిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బ్రహ్మాయ్య**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీసీ జన జాగరణ జాతర కార్యక్రమానికి ఎంఎల్సీ బసవరాజు సారయ్యని రాష్ట్ర మాస్ ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మాయ్య ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మాయ్య మాట్లాడుతూ.. ఏప్రిల్ 19 ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరగనున్న బీసీ జన జాగరణ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సారయ్య గారి మద్దతు అవసరమని కోరారు. బీసీ వర్గాల హక్కులు, సంక్షేమం కోసం ఈ జాతర కీలకమని ఆయన పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఎంఎల్సీ బసవరాజు సారయ్య , కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరంగి దుర్గారాణి, సామసామ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కవాడిపల్లిలో ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభం

**ప్రజా బాటలో భాగంగా విద్యుత్ సౌకర్యాల విస్తరణ**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా కవాడిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 160 కేవీ ట్రాన్స్ఫార్మర్‌తో పాటు ఇందిరమ్మ కాలనీలో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్‌ను ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ఏర్పాట్లు దోహదపడతాయని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకుడు కోలన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి అడగగానే స్పందించి ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు కోసం కృషి చేసిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డికి, అలాగే గ్రామ సర్పంచ్ శ్రీమతి ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాము యాదవ్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు ప్రతిష్టాత్మక ఉత్తమ ప్రతిభ పురస్కారాలు

**పాల్వంచ విశాల భారతి:**

లక్షల రూపాయల విలువైన శస్త్రచికిత్సలు, వైద్యం నిరుపేదలకు ఉచితంగా అందజేయడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుండి పాల్వంచ ప్రభుత్వ వైద్యశాల వైద్యులకు ప్రతిష్టాత్మక ఉత్తమ ప్రతిభ పురస్కారాలు లభించాయి. మంగళవారం హైదరాబాద్ రవీంద్ర భారతి లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ చేతుల మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శైలేష్ (ఆర్థోపెడిక్) అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ లక్షల రూపాయల విలువైన శస్త్రచికిత్సలు నిరుపేదలకు ఉచితంగా అందిస్తూ ప్రభుత్వ వైద్యంపై సామాన్యుల్లో నమ్మకం కల్పిస్తున్నారని అభినందించారు. పేదవర్గాలకు ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు అభినందించి మరింతగా ప్రోత్సాహించాల్సిందేనని, నిత్యం ఆసుపత్రిని పర్యవేక్షిస్తూ పేదలకు వైద్యం అందించడానికి, ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడుతున్న డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాంప్రసాద్, RMO డాక్టర్ సోమరాజుదొర, సిబ్బందిని ఆయన అభినందించారు. పాల్వంచ ఆసుపత్రిలో 100 పడకల కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



# సస్పెండ్ అయిన అధికారులే నిజాలు బయటపెట్టాలి




- **బీజేపీ వినూత్న నిరసన**
- **150 కోట్ల అవినీతి వెనుక రాజకీయ పెద్దలే**
- **అసలు నేరస్తులు బయటపడాలి**

**విశాలభారతి:**

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ సర్కిల్‌లో వెలుగులోకి వచ్చిన 150 కోట్ల భారీ అవినీతి కుంభకోణంపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. సస్పెండ్ అయిన అధికారులు నోరు విప్పి అసలు నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ బీజేపీ క్లస్టర్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఈ అవినీతి కేవలం అధికారుల పని కాదు. దీని వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పెద్దల రాజకీయ ఆశీర్వాదం ఉంది. అసలు నేరస్తులు బయటపడాలి అని ఘాటుగా ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి మరియు కాంగ్రెస్ నేతలు బీజేపీపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ... దోషులు బయటపడతారనే భయంతోనే బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నిజం బయటకు రావడాన్ని ఎవ్వరూ ఆపలేరు అని మండిపడ్డారు. గత 12 సంవత్సరాలుగా బడంగ్‌పేట్ ప్రాంతంలో అవినీతి నిరాటంకంగా కొనసాగుతోందని ఆరోపిస్తూ... నగర పంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వరకు దోపిడీ రాజ్యమేలింది. ఈ దోపిడీని మొదటి నుంచి వెలికి తీసింది బీజేపీనే అని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు పని చేయకుండానే టెండర్లు మంజూరు చేసి కోట్ల రూపాయలు దోచుకున్నారని, బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నపాటి మరమ్మతుల పేరుతో రూ.40 లక్షలు మింగేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఇచ్చిన ఫిర్యాదుల వల్లే ఈ అవినీతి బాగోతం బయటపడింది. లేకపోతే ప్రజల డబ్బు ఇంకా దోచుకుంటూనే ఉండేవారు అని విమర్శించారు. ఈ కేసుపై సిట్ లేదా సీబీఐతో సమగ్ర విచారణ జరపాలని, సంబంధిత రాజకీయ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, దోచుకున్న ప్రజల డబ్బును పూర్తిగా రికవరీ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- **ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి ప్రతినిధి :కొత్తగూడెం:**



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న జిల్లాలో ప్రజలకు నాణ్యమైన మరియు అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని,అన్నారు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారి, సిబ్బందిపై ఉన్న బాధ్యతగా తెలిపారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం విశేషమని తెలిపారు . క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.... జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు మరియు ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు దారా ప్రసాద్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్

- **కార్మిక రంగ సేవలకు గుర్తింపు – శుభాకాంక్షలు తెలిపిన నేతలు**
- **న్యూఢిల్లీలో ఘనంగా గౌరవ డాక్టరేట్ ప్రదానం**
- **కార్మిక హక్కుల కోసం దశాబ్దాలుగా సేవలందించిన జనక్ ప్రసాద్**
- **సత్తుపల్లి ఐఎన్టీయూసీ నాయకులు, కార్మికుల్లో హర్షం**

**సత్తుపల్లి, విశాలభారతి :**

తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడంపై ఐఎన్టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకుడు తీగల క్రాంతి కుమార్ జనక్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.న్యూఢిల్లీలో జిహెచ్ఆర్టి ఇండియా, వెబ్బిక్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. కార్మిక రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది.ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ, జనక్ ప్రసాద్ దశాబ్దాలుగా ట్రేడ్ యూనియన్ నాయకుడిగా, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యుడిగా కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు, జీతభత్యాలు, సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాలపై ఆయనకు అపారమైన అనుభవం ఉందని తెలిపారు.జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించడం ఐఎన్టీయూసీతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికులందరికీ గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, డి.ఎల్.ఆర్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.




# దళిత రత్న అవార్డు గ్రహీత చిన్నపాక పద్మ శ్రీనివాస్‌కు ఘన సత్కారం

**బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సేవలకు గుర్తింపు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా సమాజ సేవలో విశిష్ట సేవలు అందించిన చిన్నపాక పద్మ శ్రీనివాస్ కి "దళిత రత్న అవార్డు" లభించిన నేపథ్యంలో పస్మముల ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. పేదలు, అనాధ పిల్లల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న చిన్న పాక శ్రీనివాస్ సేవలను కొనియాడుతూ, ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు మహేష్ గౌడ్, శివలింగం గౌడ్, ఏల మధుసూదన్, రాజు ముదిరాజ్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తోకల శ్రీనివాస్ రెడ్డి

**రామచందర్ రావును కలిసి కృతజ్ఞతలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రామచందర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానని, అందుకు రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అలాగే 2028 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు చేరేలా వివరించి, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కఠిన చర్యలు



**బుద్వేల్ టీచర్స్ కాలనీలో కూల్చివేతలు**

**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రామం టీచర్స్ కాలనీలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. నగరంలో పెరుగుతున్న అనధికార నిర్మాణాలను అరికట్టే దిశగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు అంతస్తులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు గుర్తించారు. ముందుగా సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేసి, చట్టబద్ధంగా స్పందించే అవకాశం ఇచ్చినప్పటికీ, కొంతమంది యజమానులు స్పందించకపోవడంతో అధికారులు కూల్చివేతలకు దిగారు. భారీ యంత్రాంగంతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు, అక్రమంగా నిర్మించిన భాగాలను తొలగిస్తూ కూల్చివేతలను అమలు చేశారు. ఈ చర్యల సమయంలో స్థానికంగా కొంత ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ, అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పనులను కొనసాగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నగర అభివృద్ధి, భద్రత దృష్ట్యా అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలు ప్రమాదకరమని హెచ్చరించారు. భవన నిర్మాణానికి ముందు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలని, నిబంధనలను పాటించాలని ప్రజలకు సూచించారు. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేసిన అధికారులు, నగరవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటిస్తే ఇలాంటి చర్యలు అవసరం ఉండవని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# భారీ అగ్నిప్రమాదం – బండ్లగూడలో దుకాణం దగ్ధం




**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ కాళీ మందిర్ టెంపుల్ సమీపంలో ఈరోజు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న బట్టల దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే దట్టమైన పొగతో పరిసర ప్రాంతం కమ్ముకుంది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి వాటిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. ఈ అగ్నిప్రమాదంలో సిద్ధి వినాయక టెక్స్టైల్స్ అనే రెండు అంతస్తుల దుకాణం పూర్తిగా దగ్ధమై, భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# తహసీల్దార్ డి. కిషోర్‌కు ఘన సన్మానం



**అశ్వరావుపేట, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండల తహసీల్దార్‌గా డి. కిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్‌కు శాలువా కప్పి, పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ జల్లిపల్లి దేవరాజు, మహాత్మా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, అధ్యక్షులు సమయమంతుల మోహన్ గంగాధర్ రావు, సెక్రటరీ ఉప్పల పవన్ కుమార్, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం మాజీ అధ్యక్షులు ముత్తా సుమాకర్, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు కొణిజర్ల ఉమామహేశ్వర, కంచర్ల భాస్కర్ రావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లోకనాథ్ గుప్తా, దూపకుంట్ల శ్రీనివాసరావు, నడిపల్లి చందు, తడికి మల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై సింగిల్‌గానే ఉంటా

ప్రేమ, పెళ్లి విషయాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. గతంలో డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో సుదీర్ఘ ప్రేమాయణం నడిపిందీ భామ. వారిద్దరూ పెళ్లిపీటలెక్కబోతున్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే అనంతర పరిణామాల్లో ఈ జంట విడిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటనపై దృష్టి పెట్టింది శృతిహాసన్. సెలెక్టివ్‌గా సినిమాల్ని ఎంచుకుంటున్నది. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన బ్రేకప్ స్టోరీని పంచుకుంది. తాను ఇప్పటివరకు ఆరుసార్లు విఫల ప్రేమ అనుభవాల్ని చవిచూశానని, వాటివల్ల మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. ప్రస్తుతం సినిమాలే ప్రపంచంగా ప్రశాంత జీవితం గడుపుతున్నానని, ఇక మీదట తాను ఒంటరిగానే ఉంటానని శృతిహాసన్ తెలిపింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.